

ఆలపాటికి రైతునేస్తం పురస్కారాన్ని అందజేస్తున్న దృశ్యం

ఆలపాటికి అభినందనల వెల్లువ

- పామాయిల్ సాగు సమస్యలపై రాంచంద్రప్రసాద్ విశేష కృషి
- అభినందించిన మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మంత్రి తుమ్మల
- రైతు నేస్తం పురస్కారాన్ని అందుకున్న ఆలపాటి

6

మూడు జిల్లాలకు యూరియా పంపిణీ

చింతకాని, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల వ్యవసాయ అవసరాల నిమిత్తం 2512.80 వేల మెట్రిక్ టన్నుల యూరియా ఆదివారం పందిళ్లపల్లి రేక్ పాయింట్‌కు చేరిందని డీఏవో ధనసారి పుల్లయ్య తెలిపారు. రేక్ పాయింట్ నుంచి మార్క్‌ఫెడ్, ప్రైవేటు డీలర్లకు యూరియా పంపిణీని నిర్వహించారు. ఖమ్మం జిల్లాకు 1052.80 మెట్రిక్ టన్నులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు 710, మహబూబాబాద్ జిల్లాకు 550, సీఆర్‌పీ ఖమ్మంకు 200 మెట్రిక్ టన్నుల యూరియాను ప్రభుత్వం కేటాయించిందన్నారు. రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఏవో పవన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యాలయం ఇక్కడ.. విధులు అక్కడ

- ఏడేళ్లుగా అశ్వారావుపేటలోనే ములకలపల్లి పీఆర్ సబ్‌డివిజన్
- జెండా ఆవిష్కరణ రోజు మాత్రమే కార్యాలయం ఓపెన్
- ములకలపల్లికి తరలించాలని మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే వినతి

6

జీవాలతోనే వారి ప్రయాణం

- మేత కోసం కాపరుల వలస బాట
- ఐదు నెలల పాటు ఇంటికి దూరంగా..
- రోజుకో చోట మకాం.. మందల వద్దే బస

6

చారిత్రక నిర్మాణంగా.. గత పాలకుల పాలనకు ఆనవాళ్లుగా నిలిచిన ఖమ్మం ఖిల్లాకు పర్యాటక శోభ రానుంది. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితో ఖిల్లాకు పర్యాటకంగా మహర్దశ పట్టనుంది. రూ.30కోట్లతో ఖిల్లా అభివృద్ధికి చేపట్టిన పర్యాటక ప్రణాళికలో భాగంగా రూ.15కోట్లతో ఖమ్మం ఖిల్లా రోప్‌వే పనులకు నిర్మాణ సంస్థ ఇటీవలే శ్రీకారం చుట్టింది. కన్వేయర్ అండ్ రోప్‌వే సర్వీసెస్ అనే కలకత్తాకు చెందిన నిర్మాణ సంస్థ ఈ రోప్ పనులను ప్రారంభించింది. దీంతో ఖిల్లాను దశలవారీగా పర్యాటకంగా అభివృద్ధి చేయనున్నారు.



జిల్లాకు పర్యాటక శోభ

- రోప్‌వే పనులకు శ్రీకారం
- మంత్రి తుమ్మల చొరవతో మారనున్న ఖిల్లా మహర్దశ

ఖమ్మం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : కాకతీయులు, నిజాం రాజులు, రెడ్డిరాజులు, ముసునూరి రాజుల పాలనకు నిలయంగా ఉన్న ఖమ్మం ఖిల్లాకు వెయ్యేళ్లపైగా చరిత్ర ఉంది. క్రీ.శ950లో ఖమ్మం మెట్టుగా పునాదులు వేశారు. 400ఏళ్ల పాటు కాకతీయుల ఆధీనంలో ఉండగా.. ఆ తర్వాత 300 ఏళ్లపాటు రెడ్డిరాజులు పాలించారు. అనంతరం ముసునూరి నాయకులు నందపాణి, కల్లూరు, గుడ్లూరు రాజులు స్వతంత్రంగా ఈకోటను కేంద్రంగా చేసుకుని పాలన కొనసాగించారు. ఆ తర్వాత కుత్‌బ్‌షాహీల వశమైంది. కాలక్రమంలో ప్రస్తుతం ఈ ఖిల్లా మరుగున పడి ఉంది. కాకతీయుల కాలంలో ఖమ్మం మెట్టుగా నాటి శిల్పకళావైభవం చాటేలా ఈ కోటను నిర్మించారు. గ్రానైట్ రాళ్లతో నిర్మించిన ఈకోట కీ.శ. 950లో ప్రారంభమై.. 1050నాటికి నిర్మాణాన్ని పూర్తి చేసుకుంది. నాలుగు చదరపు కి.మీ. విస్తీర్ణంలో ఎత్తైన ప్రహరీని 40నుంచి80 అడుగుల ఎత్తున నిర్మించారు. 10 ద్వారాలు ఏర్పాటు చేశారు. సింహద్వారంతో పాటు ఇతర ద్వారాలు, ఫిరంగులు కూడా ఏర్పాటుచేశారు. కాకతీయుల వంశం అనంతరం పలువురు రాజులు పాలించి అనంతరం కుతుబ్‌షాహీలు 1531 ప్రాంతంలో కోటను పాలిస్తున్న సీతాపతి స్వతంత్ర రాజును ఓడించి సుల్తాన్ కులీకుతుబ్‌షా ఖమ్మంఖిల్లాను స్వాధీనం చేసుకున్నారు. ఆతర్వాత నిజాం పాలనలోకి వచ్చిన ఖిల్లా.. ఆ తర్వాత నిరుపయోగంగా మారింది. ఎంతో చారిత్రాత్మకంగా నిర్మించిన ఖిల్లా.. పర్యాటకులను ఆకర్షించేందుకు, ఖిల్లా చరిత్రను నేటితరాలకు తెలియచేసేందుకు సుమారు రూ.30కోట్లతో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అనేక సౌకర్యాలను కల్పిస్తోంది. రోప్‌వేతో పాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు పర్యాటకులు ఉండేలా వసతులు సమకూరుస్తోంది. ఖిల్లాకు రోప్‌వే పూర్తయితే.. ఎత్తయిన కొండను పిల్లలు, వృద్ధులు సందర్శించే అవకాశం ఉంటుంది.



మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవ

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం ఎమ్మెల్యేగా పోటీ చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో గెలిచిన వెంటనే రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రిగా కేబినేట్‌లో అవకాశం దక్కడంతో.. మంత్రిగా ఖిల్లాను సందర్శించారు. తర్వాత పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును స్వయంగా తీసుకువచ్చి చూపించారు. ఖిల్లా అభివృద్ధికి హామీ పొందారు. పర్యాటక, పురావస్తు శాఖ అధికారులు సందర్శించిన తర్వాత మంత్రి తుమ్మల సూచనతో రోప్‌వేతో పాటు ఇతర సౌకర్యాలు, పర్యాటకులకు కల్పించేలా ప్రణాళిక రూపొందించారు. ఖిల్లా అభివృద్ధికి మేయర్ పునుకొల్లు నీరజ కూడా కార్పొరేషన్ నుంచి నిధుల ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవడంతో సుమారు రూ.30కోట్లు మంజూరయ్యాయి. దీంతో టెండర్ల ప్రక్రియ ముగియడంతో.. పనులు దక్కించుకున్న నిర్మాణ సంస్థ ముందుగా రోప్‌వే పనులకు శ్రీకారం చుట్టింది. ప్రదేశంలో 15 పిల్లర్ల ఏర్పాటుకు గోతులు తవ్వుతున్నారు. అంతా బండరాయిగా ఉండడంతో గోతుల తవ్వకానికి ఇబ్బందిగా మారింది. డ్రిల్లింగ్‌తో గోతుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రోప్‌వే పనులు పూర్తికాగానే ఇతర సౌకర్యాలు కలిపించనున్నారు. మొత్తమ్మీద ఏడాదిలోగా ఖమ్మం ఖిల్లాకు పర్యాటక శోభ రానుంది.



క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తులు

రామాలయంలో భక్తుల సందడి

- రామయ్యకు అభిషేకం, సువర్ణ పుష్పార్చన
- భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు
- 'గుమ్మడి నర్సయ్య' బయోపిక్ డైరెక్టర్ ప్రత్యేక పూజలు

భద్రాచలం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆదివారం కార్తీకమాసం కావడంతో.. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకదేశం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. వేకువజాము నుంచే భక్తులు పవిత్ర గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి తమ ఆరాధ్య దైవమైన రామయ్య దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరి దర్శనం చేసుకున్నారు. ఇదే సమయంలో మూలవరులకు పంచామృతాభిషేకం, సువర్ణ పుష్పార్చన (మిగతా 6వ పేజీలో)

'స్కిల్'తో మరిన్ని అవకాశాలు

- మనదేశంలో జనాభా ఎక్కువ.. ఉద్యోగాలు తక్కువ
- ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి
- సింగరేణి సహకారం ఎప్పుడూ ఉంటుంది
- సంస్థ డైరెక్టర్ తిరుమలరావు
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి సారథ్యంలో జిల్లా అభివృద్ధి
- ఎమ్మెల్యే మట్టా రాగమయి
- 72 కంపెనీల రాక... 4611 ఉద్యోగ అవకాశాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు, సింగరేణి అధికారులు

సత్తుపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : సత్తుపల్లి వంటి మారుమూల ప్రాంతంలో ఎంతో నైపుణ్యం కలిగిన యువత ఉన్నారని, వీరిందరి కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లయితే మరిన్ని అవకాశాలు పొందవచ్చునని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి అన్నారు. సింగరేణి ప్రభావిత ప్రాంతం సత్తుపల్లిలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, ఇదే విషయమై సంస్థ సీఎండీ, ముఖ్యమంత్రుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. సింగరేణి, టాస్క్ సంయుక్త ఆధ్వర్యంలో సత్తుపల్లిలో ఆదివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన మన దేశంలో ఉద్యోగాల కల్పన చాలా తక్కువన్నారు. కానీ ఈ ప్రాంతంలోని నిరుద్యోగుల కోసం ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ముందుకు వచ్చిన సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ దంపతులను ప్రత్యేకంగా అభినందించారు. ఉద్యోగాల సాధనే లక్ష్యంగా యువత ఉన్నత విద్యకు చేరుకోవాలని, ఇక్కడికి వచ్చిన యువతకు ఉద్యోగాలు రాకపోతే బాధపడాల్సిన అవసరం లేదన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని అవకాశాలు పొందవచ్చునన్నారు. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారన్నారు. సింగరేణి సైతం ఈ ప్రాంత అభివృద్ధి పూర్తి సహకారం అందించాలని కోరారు.

అనంతరం సింగరేణి డైరెక్టర్ తిరుమలరావు మాట్లాడుతూ.. యువత అంతా ఉద్యోగాలలో స్థిరపడాలనే ఉద్దేశ్యంతో జాబ్‌మేళా నిర్వహించడం (మిగతా 6వ పేజీలో)

కంఫర్ట్ జోన్ నుంచి బయటకు రావాలి

సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

యువత ప్రభుత్వ ఉద్యోగాలకే కాకుండా ప్రైవేట్ సెక్టార్‌లో ఉద్యోగాలు పొంది ఆర్థికంగా ఎదగవచ్చు. లక్షల్లో ప్యాకేజీలు వస్తేనే జాబ్ చేయాలనే కంఫర్ట్ జోన్ నుంచి బయటకు రావాలి. దూరప్రాంతాలకు వెళ్లేందుకు మొదటి మెట్టుగా భావించి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ముందుకు వెళ్లాలి. పని పట్ల నిజాయితీగా ఉంటే మన నైపుణ్యం, అనుభవాన్ని గుర్తించే యాజమాన్యాలు మరిన్ని అవకాశాలను కల్పిస్తాయి. ఇలాంటి అవకాశాలను ఎట్టి పరిస్థితుల్లో వదులుకోవద్దు. డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి సారథ్యంలో జిల్లా అభివృద్ధి పథంలో ఉంది. ఇందుకు ఈ ప్రాంత ప్రజల సహకారం కూడా తప్పకుండా ఉండాలి.

ఖమ్మం కార్పొరేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పెరుగుతున్న వాయు, వాతావరణ కాలుష్యాలను అధిగమించి రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థలు ముందుకు వెళ్తున్నాయి. గ్రామ పంచాయతీల నుంచి చిన్నపాటి మున్సిపాలిటీలు సైతం తడి, పొడి, హానికరమైన చెత్తను విడివిడిగా సేకరించి.. వాటి ద్వారా ఇంధన, సేంద్రియ ఎరువులు, ఇతర ఉత్పత్తులను తయారు చేసి ఆదాయం పొందుతున్నాయి. కానీ ఖమ్మం నగర పాలక సంస్థలో అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా కనీసం తడి పొడి చెత్తను



ప్రభుత్వ ట్రాక్టర్‌లో ప్లాస్టిక్ వ్యర్థాల సంచులు

పారిశుధ్యం వద్దు.. ప్లాస్టిక్ ముద్దు!

- నగర పాలక సంస్థలో తడి, పొడి చెత్త సేకరణపై లేని శ్రద్ధ
- ప్లాస్టిక్ వ్యర్థాలు మాత్రం ప్రత్యేకంగా సేకరణ
- గంటల తరబడి క్యూ కట్టి పని వేళల్లో అమ్మకాలు
- పట్టించుకోని కేఎంసీ అధికారులు

విడివిడిగా సేకరించడం లేదు. చైతన్యవంతమైన ఖమ్మం నగర ప్రజలు తమ నివాసాల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా తీసుకొచ్చి పారిశుధ్య వాహనాలకు అందించినా.. ప్రజల ఎదుటే పారిశుధ్య కార్మికులు కలిపి తమ వాహనాల్లో నింపుకుంటున్నారు. తడి, పొడి చెత్త సేకరణ జరగకపోవడంతో.. కేఎంసీకి కనీస పారిశుధ్య నాణ్యతా ప్రమాణాలు అవార్డులు కూడా రాలేదు. గత పదేళ్లలో లేని విధంగా అవార్డుల రేసులో దిగువ స్థాయిలోకి వెళ్లింది.

ప్లాస్టిక్ వ్యాపారంపై మాత్రం జోరు

ఖమ్మం నగరపాలక సంస్థ రూ.కోట్ల నిధులతో సొంతంగా ట్రాక్టర్లు, ఆటో ట్రాలీలు కొనుగోలు చేసి వాటి ద్వారా చెత్త సేకరణ చేస్తోంది. కానీ వాహనాలపై పర్యవేక్షణ మాత్రం చేయడం లేదు. తడి పొడి చెత్తను వేర్వేరుగా సేకరించని వాహనాలకు జరిమానాలు విధించడం లేదు. దీంతో 95శాతం పారిశుధ్య వాహనాలు తడి, పొడి చెత్త సేకరణ చేయాలనే ఆలోచన మరిచిపోయాయి. ఇదే క్రమంలో ప్రతీ పారిశుధ్య వాహనానికి చుట్టూ సంచులు కనిపిస్తున్నాయి. నివాసాలు, ఫంక్షన్ హాళ్లు, కమర్షియల్ ప్రాంతాలు, వీధుల వెంట ఉన్న ప్లాస్టిక్‌ను పారిశుధ్య కార్మికులు సేకరించి ఇనుప కొట్టు దుకాణాదారులకు అమ్మకాలు చేస్తున్నారు. ప్రతీరోజు ఒక్కో వాహనానికి రూ.300 నుంచి 500 వరకు అదనపు ఆదాయం వస్తోంది. బైపాస్‌రోడ్డులోని ఇనుప దుకాణం వద్ద క్యూ కట్టి మరీ కేఎంసీ పారిశుధ్య వాహనాలు ఉంటున్నాయి. దీంతో రోజుకు మూడు ట్రిప్పులు వేయాల్సిన పారిశుధ్య వాహనాలు కేవలం రెండు ట్రిప్పులు మాత్రమే వేస్తున్నాయి.

వరంగల్ టు ఖమ్మం

నగరంలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చేందుకు ఇటీవల కలెక్టర్ అనుదీప్ సైతం 10రోజుల ప్రత్యేక కార్యాచరణ చేశారు. అయితే ప్రధాన రహదారుల వెంట పారిశుధ్య పనులు జరిగినా.. డివిజన్లలోని అంతర్గత రహదారులు, విలీన ప్రాంతాల్లో ఆ మేరకు పారిశుధ్య పనులు మెరుగుపడలేని ఆయా కార్పొరేటర్లు గగ్గోలు పెడుతున్నారు. పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు మాత్రం వరంగల్ నుంచి ఖమ్మానికి రాకపోకలు చేస్తున్నారని కార్పొరేటర్లు విమర్శలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే పారిశుధ్య అధికారి తీరుపై ఇటీవలే పలువురు కార్పొరేటర్లు మేయర్‌కు సైతం ఫిర్యాదులు చేసినట్టు తెలుస్తోంది.



ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

కష్టించి పనిచేసే వారికే వేతనాలు

- ఉపాధి హామీ పనుల్లో ఈ-కేవైసీ
- నకిలీ మస్టర్ల నివారణే లక్ష్యం
- నవంబరు నుంచి ముఖ ఆధారిత హాజరు
- జిల్లాలో 75.25 శాతం ప్రక్రియ పూర్తి

7

ల(కి)క్కు నేడే



సీక్వేల్‌లో మద్యం లాటరీకి పూర్తయిన ఏర్పాట్లు

- ఖమ్మం సీక్వేల్‌లో లాటరీకి ఏర్పాట్లు
- కలెక్టర్ సమక్షంలోనే మద్యం దుకాణాల ఎంపిక ప్రక్రియ
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఎక్సైజ్ శాఖ

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : రెండేళ్ల కాల పరిమితితో మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి సోమవారం ల(కి)క్కు దక్కనుంది. ఈనెల 23వ తేదీ వరకు జిల్లాలోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌ల పరిధిలోని 116 మద్యం దుకాణాలకు దరఖాస్తులను స్వీకరించారు. ఖమ్మం - 1 స్టేషన్ పరిధిలోని 27 మద్యం దుకాణాలకు 1241 దరఖాస్తులు, ఖమ్మం- 2 స్టేషన్‌లో 18 దుకాణాలకు 710, నేలకొండపల్లి స్టేషన్ పరిధిలోని 15 మద్యం దుకాణాలకు 468, వైరాలో 13 దుకాణాలకు 470, మధిర స్టేషన్ పరిధిలో 14దుకాణాలకు 464, 19 దుకాణాలకు 791, సింగరేణిలో 10 మద్యం దుకాణాలకు 286 దరఖాస్తులు.. మొత్తం 4,430 మంది ఆశావహులు ఒక్కో దరఖాస్తుకు రూ.3 లక్షలు చెల్లించి మద్యం దుకాణాలను కైవసం చేసుకునేందుకు నిరీక్షిస్తున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమక్షంలో సోమవారం ఖమ్మం నగరంలోని సీక్వేల్ రిసార్ట్‌లో లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాల ఎంపిక ప్రక్రియ పూర్తి కానుంది. సరైన గుర్తింపు కార్డులతో వచ్చిన దరఖాస్తుదారులను ఉదయం 9గంటల నుంచి లాటరీ ప్రాంతంలోకి అనుమతిస్తారు. అయితే సీక్వేల్ రిసార్ట్‌లోకి సెల్‌ఫోన్లను అనుమతించడం లేదని అధికారులు ప్రకటించారు. ఉదయం 11గంటల నుంచి లాటరీ విధానం అమలు జరుగుతుంది. ఈ మేరకు కావాల్సిన ఏర్పాట్లను జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు పూర్తి చేశారు.

జిల్లా కోర్టులో బార్ కౌన్సిల్ ఎన్నికల సందడి

- జనవరి 31 నాటికి ఎన్నికలు పూర్తి చేయాలని సుప్రీం ఆదేశం
- పోటీలో జిల్లా నుంచి ముగ్గురు అభ్యర్థులు

6

రాష్ట్రస్థాయి టీటీ పోటీల్లో ఓవరాల్ **చాంపియన్ జిల్లా జట్టు**

7

మున్నేరులో ఉత్సాహంగా **ఈత ర్యాలీ**

ఘనంగా కార్తీక పూజలు



ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా ఆదివారం నగరంలోని పలు శివాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే భక్తులు ఆలయాలకు చేరుకొని అభిషేకాలు నిర్వహించారు. నగరంలోని కైకొండాయిగుడెం వద్ద గల శ్రీవిశాలక్షీ సమేత కాశి విశ్వేశ్వర స్వామి ఆలయంలో సాయంత్రం ఆకాశ దీపం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆకాశదీపాన్ని ధ్వజస్థంభంపై ఉంచి భక్తులకు దర్శనం కల్పించారు.

నేడు మొదటి కార్తీక సోమవారం

కార్తీక మాసంలో నేడు మొదటి కార్తీక సోమవారం కావటంతో జిల్లా వ్యాప్తంగా శివాలాయాలలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక అభిషేకాలు, పూజలు ప్రారంభం కానున్నాయి. తెల్లవారుజామును 3 గంటల నుంచి శివాలయాలలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తారు. దీంతో శివాలయాలు భక్తులతో కిటికిటలాడనున్నాయి. నగరంలోని గుంటుమల్లేశ్వర స్వామి ఆలయం, ఎస్పీ ఆఫీస్ రోడ్డులోని శివాలయం, బ్రాహ్మణబజారు శివాలయం, తీర్ధాల శివాలయం, కూసుమంచి శివాలయం తోపాటు జిల్లాలోని పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడనున్నాయి.



శివాలయంలో ఆకాశదీపం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

జీవాలతో.. జీవనయానం

- జీవాల మేత కోసం కాపరుల వలస బాట
- ఐదు నెలల పాటు ఇంటికి దూరంగా..
- రోజుకో చోట మకాం.. మందల వద్దే బస

పాల్వంచ రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఈ ఐదు నెలలు జీవాలు (గొర్రెలు)తో వారి ప్రయాణం.. ఇవే వారికి జీవనాధారం.. వృత్తి ఇదే అయినప్పటికీ కుటుంబానికి జీవాలే మూల ఆధారం. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి నెల 20 రోజులుగా ఇంటి నుంచి బయలు దేరారు. అక్కడ ఈ జీవాలకు మేత లేకపోవడంతో ప్రతీ ఏట ఈ ప్రాంతాలకు తీసుకువచ్చి వాటి సంరక్షణ చూసుకుని తిరిగి ఐదు నెలలకు వెళ్తుండడం వీరికి ఆనవాయితీగా మారింది. అక్కడ మేత లేకపోవడం వల్ల జీవాలు బక్కచిక్కి అనారోగ్యానికి పాలవుతున్నట్లు గొర్రెల యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల్లో గొర్రెలను ఇటువైపు తొలుకు వచ్చి అక్కడక్కడ చేలల్లో ఉంచుతూ ఆ రైతులకు జీవాలతో ఎరువును సమకూర్చే విధంగా ఉపయోగపడుతున్నారు. ఎండ, వాన, చలి వర్షంలో సైతం ఊరి బయట ప్రాంతాల్లో చిన్న చిన్న టార్పెట్ పట్టాలను పాకలుగా వేసుకుని అక్కడే నివాసముంటున్నారు. రెండు మూడు రోజులు తిరిగి మరో ప్రాంతానికి వెళ్తన్నారు. ఏదేమైనా ఇల్లు విడిచి జీవాలతో ఐదు నెలల పాటు వీటితో ప్రయాణం చేయడం జీవన పోరాటంలో ఇది ఒక భాగమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ తొలకరి జల్లులకు తమ గ్రామాలకు జీవాలను తోలుకుని పోతుంటారు. ఈ ఐదు నెలల పాటు వారి కష్టాలను వెళ్లబుచ్చారు.



మహబూబ్‌నగర్ నుంచి పాల్వంచ మీదుగా వెళ్తున్న జీవాలు

ప్రతి ఏటా జీవాలతో వస్తుంటాం..

● గనుమల అశోక్, ధన్‌బాద్ గ్రామం, మహబూబ్‌నగర్ జిల్లా



ప్రతీ ఏటా మహబూబ్‌నగర్ నుంచి ఈ ప్రాంతాలను జీవాలను తొలుకుని వస్తూంటాం. ఐదు నెలల పాటు ఇటువైపే తిప్పుకుని తొలకరి సమయానికి తిరిగి ఇళ్లల్లోకి వెళ్తాం. ఇవే మారు జీవనాధారం. అక్కడ మేత లేకపోవడంతో జిల్లాలు దాటి మేత ఉన్న ప్రాంతాలకు తీసుకువస్తున్నాం.

ఓటు చోర్‌తో బీజేపీ పాలన

ఇల్లెందుటౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఓటు చోర్‌తో బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో పాలన సాగిస్తుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య విమర్శించారు. ఆదివారం ఇల్లెందు పట్టణంలోని రెండవ వార్డులో ఓటు చోర్‌ని నిరసిస్తు, ఏఐసీసీ ఆదేశాల మేరకు సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కోరం మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ, ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తుందని విమర్శించారు. దేశవ్యాప్తంగా ప్రజల స్వేచ్ఛా హక్కులను కాలరాస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, మండల అధ్యక్షుడు పులిసైదులు, పట్టణ అధ్యక్షుడు దానియల్, వర్కింగ్ ప్రసిడెంట్ సుదర్శన్ కోరి,జాఫర్, సాంబమూర్తి, శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ మండలరాము, తదితరులున్నారు.



సంతకాలు సేకరిస్తున్న ఎమ్మెల్యే కోరం

చెకుముకి పోటీలను పకడ్బందీగా నిర్వహిస్తాం

- జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామిశెట్టి

కొత్తగూడెం టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి పోటీలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామిశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. నవంబరు మొదటి వారంలో చెకుముఖి పరీక్షల నిర్వహణకు అవసరమైన ప్రణాళికను రూపొందిస్తున్నట్లు ప్రకటించారు. ఆదివారం కొత్తగూడెంలో జరిగిన జిల్లా విజ్ఞాన వేదిక ప్లీనం సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవిష్యత్ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. జన విజ్ఞాన వేదిక ప్రజల్లో మరింత చైతన్యాన్ని తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు ప్రకటించారు. ఆర్థిక వనరులను సమీకరించడంపై చర్చించారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మండవ సుబ్బారావు, ఉపాధ్యక్షురాలు కస్తూరి, మాజీ అధ్యక్షుడు సాయిబాబా, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరభద్రం, మోహన్‌రావు, విశ్లేషకులు సత్యం, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామిశెట్టి

నెలనెలా వెన్నెలను ఆదరిస్తున్న ప్రేక్షకులకు అభినందనలు

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న నెలనెల వెన్నెల కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్న ప్రేక్షకులకు, టికెట్ లేకుండా ఉచితంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకులకు ప్రత్యేకంగా అబినందించాలని ముఖ్య అతిధి వెంటపల్లి సత్యనారాయణ అన్నారు. ఆదివారం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన లఘుచిత్రాలు, మమ్ముల్ని బ్రతకనివ్వండి నాటికలు ఎంతో ప్రజాధారణ పొందాయన్నారు. ఖమ్మంవాసి ప్రముఖ మెజీషియన్ నటులడు దర్శకుడు రామడుగు వసంత్‌కుమార్, మొగిలలి గుణకర్ దర్శకత్వం వహించిన టెన్‌టైంమ్స్, ఈ తరం లఘు చిత్రాలు ప్రేక్షకులను ఎంగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నిర్వహకులు సుబ్రమణ్యకుమార్, జగన్‌మోహన్‌రావు, నాగబత్తిని రవి, సదానందం, వేల్పుల విజేత, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యనారాయణ

ఉపాధ్యాయులకు టెట్ మినహాయించాలి

ఆళ్లపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) 2010కి ముందు నియమకం చేపట్టిన ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యాక్షుడు జోగరాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ- దశాబ్దాలుగా ఉపాధ్యాయులు విద్యారంగంలో తమ ప్రతిభ, అనుభవం, నిబద్ధతతో సేవలందించి, విద్యార్థులను తీర్చిదిద్దారు. ఇలాంటి టైంలో తిరిగి ఉపాధ్యాయులకు టెట్ రాయమని నిర్బంధించడం అన్యాయమని, సుదీర్ఘమైన వారి సేవలను అవమానించడమే అన్నారు. విద్యాహక్కు చట్టంలో 23(2)ను సవరించి టెట్ మినహాయించాలని డిమాండ్ చేశారు.

ఆలపాటికి అభినందనల వెల్లువ

- పామాయిల్ సాగు సమస్యలపై రాంచంద్రప్రసాద్ విశేష కృషి
- అభినందించిన మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మంత్రి తుమ్మల
- రైతు నేస్తం పురస్కారాన్ని అందుకున్న ఆలపాటి

దమ్మపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : పామాయిల్ రైతుల సమ్యస్యలు, సంక్షేమం కోసం ఆయిల్‌ఫామ్ రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్రప్రసాద్ చేసిన కృషిని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు కొనియాడారు. హైదరాబాద్‌లో ఆదివారం స్వర్ణభారతిట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వెంకయ్యనాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు పాల్గొని ఆలపాటి రాంచంద్రసాద్‌ను అభినందించి రైతు నేస్తం పురస్కారాన్ని అందజేశారు. ఈసందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ఒక రైతుగా ఉంటూనే పామాయిల్ రైతాంగ సమస్యలపై విశేషంగా కృషి చేయడం అభినందనీయమన్నారు.. సాగులో రసాయిన ఎరువులను తగ్గించి సేంద్రియ వ్యవసాయాన్ని చేసే విధంగా రైతులను ప్రోత్సహించాలని కోరారు. రైతుల సంక్షేమం కోసం కృషి చేసిన వారిని సత్కరించటం సంతోషంగా ఉందన్నారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఆయిల్‌ఫాం రైతుల సమస్యల కోసం కృషి చేస్తున్న ఆలపాటి మార్గదర్శిగా నిలుస్తారని అన్నారు. పామాయిల్ సాగు విస్తరణకు ప్రభుత్వ సహకారాన్ని అందించటం జరగుతుందన్నారు. మాజీ జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, కొయ్యల అచ్యుతరావు, బండి భాస్కర్, దొడ్డా ప్రసాదు, సొసైటీ చైర్మన్ ఎల్లిన రాఘవరావు, కాసాని నాగప్రసాదు, ఎర్రా వసంతరావు, కేవి.సత్యనారాయణ, మన్నెం అప్పారావు, మాజీ ఎంపీపీ సోయం ప్రసాదు, మంగేశ్వరరావు తదితరులు ఆలపాటిని అభినందించారు.

రైతు నేస్తం పురస్కారాన్ని అందుకున్న ఉద్యాన అధికారి వేణు

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పద్మశ్రీ ఐవీ సుబ్బారావు రైతు నేస్తం పురస్కారాన్ని డాక్టర్ ఆకుల వేణు ఆదివారం అందుకున్నారు. వైరా డివిజన్ ఉద్యాన అధికారిగా పనిచేస్తున్న ఆకుల వేణు ఆదివారం హైదరాబాద్‌లో రైతు నేస్తం వ్యవసాయ మాసపత్రిక 21 వార్షికోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి, మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యానాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా అందుకున్నారు. పలు జాతీయ స్థాయి సంస్థలు ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో పాల్గొని రైతులకు మేలు చేసే విధంగ కృషిచేసిన వేణుకు గుర్తింపు వచ్చింది. ఉద్యానపంటల్లో కొత్త రకాలైన మియాజాకీ, ఆవకాడో, మెకాడ్మియా పంటలను రైతులకు ఆయన పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆకుల వేణును మంత్రి తుమ్మల అభినందించారు.



ఆకుల వేణును సన్మానిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కార్యాలయం ఇక్కడ.. విధులు అక్కడ

- ఏడేళ్లుగా అశ్వారావుపేటలోనే ములకలపల్లి పీఆర్ సబ్‌డివిజన్
- జెండా ఆవిష్కరణరోజు మాత్రమే కార్యాలయం ఓపెన్
- ములకలపల్లికి తరలించాలని మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే వినతి

అశ్వారావుపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): 2017-18లో నూతనంగా పంచాయతీరాజ్ సబ్ డివిజన్‌లను ఏర్పాటు చేస్తూ అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా ములకలపల్లి పంచాయత్‌రాజ్ సబ్ డివిజన్‌ను మంజూరు చేశారు. అప్పట్లో నూతనంగా మంజూరైన ములకలపల్లి పీఆర్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని అత్యవసరంగా ప్రారంభించాలసి రావడంతో అశ్వారావుపేట పంచాయతీ రాజ్ సబ్ డివిజన్ కార్యాలయం ఆవరణలోనే మరో భవనంలో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి అశ్వారావుపేట పీఆర్ సబ్ డివిజన్, ములకలపల్లి సబ్ డివిజన్‌లు అశ్వారావుపేటలోనే నడుస్తుంది. అప్పటి వరకు అశ్వారావుపేట సబ్ డివిజన్ పరిధిలోని ములకలపల్లి, అన్నపరెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాలను వేరు చేసి ములకలపల్లి సబ్ డివిజన్‌గా ఏర్పాటు చేశారు. సబ్ డివిజన్‌కు డీఈఈ, ఏఈఈ, ఇతర స్టాఫ్‌ను మంజూరు చేశారు. ములకలపల్లి కొత్తగూడేనికి దగ్గరలో ఉండటంతో సంబంధిత అధికారులు, సిబ్బంది అందరూ కొత్తగూడెంలోనే ఉంటున్నారు. కొత్తగూడేనికి 60 కిమీ దూరంలో ఉండటం, సబ్ డివిజన్‌కు కేటాయించిన మండలాలు కొత్తగూడేనికి ఎటుచూసిన 15-20 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో వారంతా కొత్తగూడెం నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. కార్యాలయం ఇక్కడ ఉన్నప్పటికీ అధికారులు, సిబ్బంది అంతా కొత్తగూడెంలోనే నిర్వహిస్తున్నారు. అశ్వారావుపేటలో ఏర్పాటు చేసిన ములకలపల్లి సబ్ డివిజన్ కార్యాలయం ఏడాదికి రెండు సార్లు ఆగస్టు 15, రిపబ్లిక్‌డేలకు మాత్రమే కార్యాలయాలను తెరిచి శుభ్రపరిచి జెండా ఆవిష్కరణలు చేసి కార్యాలయాన్ని మరలా మూసివేస్తున్నారు. దీని వలన ప్రజలకు కాని, ఆయా మండలాల పరిధిలోని కాంట్రాక్టర్లకు ఈ కార్యాలయం అందుబాటులో లేకుండా పోయింది. జిల్లా అధికారులు ఎందుకనో ఈ కార్యాలయాన్ని ములకలపల్లికి మార్చకుండా వదిలేశారు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శుక్రవారం హైదరాబాదులో పంచాయత్‌రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్కను కలసి ఏడేళ్లుగా అశ్వారావుపేటలో నడుస్తున్న ములకలపల్లి పీఆర్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని ములకలపల్లికి మార్చాలని, కార్యాలయానికి అవసరమైన స్థలాన్ని ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్టు ఆమెకు వినతి చేశారు. ఇప్పటికైనా అశ్వారావుపేటలోని ములకలపల్లి పీఆర్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని ములకలపల్లికి మార్చడానికి మోక్షం లభిస్తుందో లేదో చూడాలి.



అశ్వారావుపేట పీఆర్ సబ్ డివిజన్ కార్యాలయ ఆవరణలో ఉన్న ములకలపల్లి సబ్ డివిజన్ కార్యాలయం

'స్కిల్'తో మరిన్ని అవకాశాలు

(5వ పేజీ తరువాయి)


గొప్పవిషయమన్నారు. ఈ ప్రాంత అభివృద్ధిలో తమవంతుగా సింగరేణి సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. సింగరేణి తన ఉనికితో పాటు పరివాహక ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉంటుందన్నారు. ఉద్యోగాలు పొందిన యువత కూడా భవిష్యత్తులో స్థిరపడాలని భావిస్తున్నానన్నారు. ప్రజాప్రతినిధుల సహకారం కూడా ఉండాలని, యువత కోసం మరిన్ని కార్యక్రమాలను చేపడతామన్నారు. ఇప్పటికే సింగరేణి కోల్‌బెల్ట్‌లో 6ప్రాంతాల్లో జాబ్‌మేళాలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగాలు కల్పించామని, ఎలాంటి అనుభవం లేకుండా ఉద్యోగాలు కల్పించడం ఈ జాబ్‌మేళా గొప్పతనమని కొత్తగూడెం ఏరియా జీఎం అన్నారు.

72 కంపెనీల రాక.. 4611ఉద్యోగ అవకాశాలు

సత్తుపల్లిలో నిరుద్యోగ యువత కోసం ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాలో చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా మొత్తం 72 కంపెనీలు వచ్చాయి. ప్రత్యేకంగా కౌంటర్లను ఏర్పాటు చేసిన సింగరేణి సంస్థ టాస్క్ సహకారంతో ఇంటర్వ్యూలను నిర్వహించగా.. 4611మందికి జాబ్ ఆఫర్ లెటర్స్‌ను ఎంపీ, ఎమ్మెల్యేల చేతుల మీదుగా అందజేశారు. ఆన్‌లైన్‌లో ముందుగానే 11500మంది, ఆఫ్‌లైన్‌లో 2818మంది రిజిస్టర్ చేసుకోగా.. ఉద్యోగాలు రానివారు అధైర్య పడొద్దని, మళ్లీ కంపెనీలు ఉద్యోగాలను కల్పించే అవకాశం ఉందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఏసీపీ ఏ.రఘు, మునిసిపల్ కమిషనర్ కొంద్రా నరసింహా, పీఓలు ప్రహ్లద్, ఎంవీ.నరసింహారావులతో పాటు ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



నియామకపత్రాలను అందిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి ఎమ్మెల్యే రాగమయి



పేర్లను నమోదు చేసుకుంటున్న అభ్యర్థులు



హాజరైన అభ్యర్థులు

ఖమ్మం కోర్టులో బార్ కౌన్సిల్ ఎన్నికల సందడి

- జనవరి 31 నాటికి ఎన్నికలు పూర్తి చేయాలని సుప్రీం ఆదేశం
- పోటీలో ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు అభ్యర్థులు

ఖమ్మంలీగల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): దేశంలోని వివిధ రాష్ట్రాల్లో బార్ కౌన్సిల్ ఎన్నికల నిర్వహణకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈనేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లో పెండింగ్‌లో ఉన్న బార్‌కౌన్సిల్ ఎన్నికలు త్వరలో జరగనున్నాయి. దీంతో జనవరి31 నాటికి బార్ కౌన్సిల్‌లకు ఎన్నికలు పూర్తి చేయాలని సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. దేశవ్యాప్తంగా కొనిన రాష్ట్రాలతో పాటు తెలుగు రాష్ట్రాల్లో రెండేళ్లుగా బార్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించకుండా పెండింగ్ పడుతూ వస్తున్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లో బార్‌కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించనున్నారు.

ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు

రాష్ట్రబార్ కౌన్సిల్ ఎన్నికలకు ఖమ్మం నుంచి ముగ్గురు అభ్యర్థులు రంగంలో ఉన్నారు. మందడపు శ్రీనివాసరావు, తాళ్లూరి దిలీప్ చౌదరి, మద్రిప్రకాష్ పోటీలో ఉన్నారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఎన్నికలు నిర్వహించిని కారణంగా కొందరున్యాయవాదులు సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్ర బార్ కౌన్సిల్ కు ఖమ్మంబార్‌సోసియేషన్ నుంచి ముగ్గురు అభ్యర్థులు ఇప్పటికే పోటీ చేస్తామని ప్రకటించగా మరో అభ్యర్థి సైతం పోటీకి సిద్ధమవుతున్నాడు.

ఇప్పటికే ప్రచారం

అభ్యర్థులు మంతనాలు జరపనుండడంతో వాతావరణం వేడెక్కింది. పోటీచేస్తున్న అభ్యర్థులు ఇప్పటికే వివిధ రకాలుగా ప్రచారం నిర్వహిస్తూ న్యాయవాదులను వ్యక్తి గతంగా కలుస్తున్నారు. ఓట్లు అభ్యర్థిస్తూ సమావేశాలు నిర్వహిస్తున్నారు. అభ్యర్థులు సైతం న్యాయవాదుల సంక్షేమం కోసం న్యాయవాదుల రక్షణ చట్టానికి కృషి చేస్తామని పలురకాల హామీలు గుప్పిస్తున్నారు ఖమ్మం బార్ అసోసియేషన్‌లో 1030 మంది న్యాయవాదులు ఉండగా, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు సత్తుపల్లి, మదిర, ఖమ్మంలో కలిపి 1600 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.



దిలీప్‌చౌదరి, శ్రీనివాసరావు, ప్రకాష్

ఖమ్మం బార్‌అసోసియేషన్‌కు పోటీలో అభ్యర్థులు

ఖమ్మం బార్‌అసోసియేషన్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు సైతం ప్రచారం చేసుకుంటున్నారు. అధ్యక్ష పదవి అభ్యర్థులు యడ్లపల్లి రమష్, నుగ్గుల వేంకటేశ్వర గుప్తాలతో పాటు వివిధ పోస్టులకు పోటీ చేసే అభ్యర్థులు ఇళ్లకు వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. కోర్టుల్లో వరసగా ఎన్నికలు జరుగుతుండటంతో న్యాయవాదుల్లో సందడి వాతావరణం నెలకొంది.

కూసుమంచిలో జూదరుల అరెస్ట్

● రూ.2,49,600 నగదు స్వాధీనం

కూసుమంచి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయకన్‌గూడెం గ్రామశివారు కైలాసపు రామ్మూర్తి మామిడితోటలో జూదం ఆడుతున్న వారిపై కూసుమంచి పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. వారివద్ద నుంచి రూ.2,49,600 నగదుతోపాటు, రెండు మోటార్ సైకిళ్లు, ఎనిమిది మొబైల్స్, పది పెట్టెల ప్లేయింగ్ కార్డులు, ఎర్రకాయిన్‌లు 100, పసుపు కాయిన్‌లు 98, స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ నాగరాజు కథనం ప్రకారం.. నాణేలతో డబ్బులు పందెంగా పెట్టి జూదం ఆడుతున్నారని విశ్వాసనీయ సమాచారం మేరకు మామిడి తోటపై దాడులు చేసినట్లు తెలిపారు. లోపల-బయట అనే జూదం ఆటలో పాల్గొన్నట్లు అంగీకరించారని తెలిపారు. ఈదాడిలో ఖమ్మంఅర్బన్ మండలానికి చెందిన ఒకరు, సూర్యాపేట జిల్లా నేరేడుచర్లకు చెందిన మరొకరు, ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన ఇద్దరు, ఖమ్మానికి చెందిన ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా మరో 13 మంది పరారయ్యారని, వారికోసం గాలిస్తున్నట్లు తెలిపారు. జూదం వంటి సామాజిక వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొనకూడదని ఎస్ఐ హెచ్చరించారు. ఇలాంటి కార్యకలాపాలు గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. దాడుల్లో ఖమ్మంరూరల్ ఎస్ఐ విశ్వతేజ, హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

రామాలయంలో భక్తుల సందడి

(5వ పేజీ తరువాయి)

అర్జిత సేవగా నిర్వహించగా.. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అదే విధంగా సహస్రనామార్చన, నిత్య కల్యాణంలో సైతం అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. కార్తీక ఆదివారం కావడంతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను చిత్రకూట మండపంలో నిర్వహించారు. కాగా.. గుమ్మడి నర్సయ్య బయోపిక్ డైరెక్టర్ పరమేశ్వర్ హివరాలి రామయ్యను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రవల్లిక ఆర్ట్ ప్రొడక్షన్స్ ఎన్.సురేష్‌రెడ్డి నిర్మాతగా వ్యవహరిస్తుండగా.. చిత్రదర్శకుడు పరమేశ్వర్ హివరాలి రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో గర్వించదగ్గ ప్రజా ప్రతినిధిగా గుర్తింపు పొందిన గుమ్మడి నర్సయ్య జీవితగాధను బయోపిక్‌గా తీస్తున్నామన్నారు. ఇప్పటికే విడుదల చేసిన టీజర్‌కు మంచి ఆదరణ వచ్చిందని పరమేశ్వర్ తెలిపారు. అందరి అంచనాలకు మించి ఈ చిత్రం నిర్మిస్తున్నామని, దశాబ్దాల పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడిన గుమ్మడి నర్సయ్య జీవితం నేటి తరం నాయకులకు ఆదర్శప్రాయమని ఆయన తెలిపారు.



రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న గుమ్మడి నర్సయ్య బయోపిక్ డైరెక్టర్

కష్టించి పనిచేసే వారికే వేతనాలు

ఉపాధిహామీ పనుల్లో ఈ-కేవైసీ..
నకిలీ మస్టర్ల నివారణే లక్ష్యం
నవంబరు నుంచి
ముఖ ఆధారిత హాజరు
జిల్లాలో 75.25శాతం ప్రక్రియ పూర్తి



ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

అశ్వారావుపేట రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించి పేదలకు పూర్తిస్థాయిలో పనులు కల్పించి కుటుంబాలకు బాసటగా ఉండి ఆర్థిక ఇబ్బందులు తొలిగించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్నదే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం. ఈ పథకం ద్వారా ఏటా కోట్లాది కుటుంబాలకు ఉపాధి అందుతుంది. ఉపాధిహామీ పనులకు వచ్చే కూలీలకు సరైన వేతనాలు అందేలా, పనుల్లో పారదర్శకత కోసం రకరకాల మార్పులతో పథకాన్ని అమలు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ పథకాన్నే నమ్ముకుని జీవించే పేదకుటుంబాలు ఎన్నో ఉన్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నా ఇప్పటి ఈ పథకంలో అనేక అవకతకవలు జరుగుతూనే ఉన్నాయి. పనులకు రాకపోయినా మస్టర్లు వేయడం, ఒకరికి బదులు మరొకరు పనులకు రావటం, క్షేత్రస్థాయిలో కొందరు సిబ్బంది అవినీతికి పాల్పడటం వంటివాటితో కొన్నిచోట్ల ఉపాధి పథకం పక్కదారి పట్టి నిధులు దుర్వినియోగం అవుతూనే ఉన్నాయి. ఈ విషయం సామాజిక తనిఖీల్లో వెలుగులోకి వస్తున్నా పెద్దగా మార్పు రావటంలేదు. ఈ నేపథ్యంలో అవకతవకలను అరికట్టేందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ చర్యలు చేపట్టింది. జాబ్‌కార్డులను ఈ కేవైసీ చేయించి పనులకు వచ్చేవారికే వేతనాలు అందేలా చూడటంతో పాటు నకిలీ మస్టర్లకు అడ్డుకట్ట వేసే విధంగా చర్యలు చేపట్టింది.

జాబ్‌కార్డు.. ఆధార్‌తో ఈ-కేవైసీ

ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్యలో తేడాలను అరికట్టేందుకుగాను గతంలోనే జాబ్‌కార్డుకు ఆధార్‌ను లింక్ చేశారు. జాబ్‌కార్డులో ఉన్న ప్రతీ ఒక్కరి ఆధార్‌ను జాబ్‌కార్డు నెంబర్‌తో లింక్ చేయడం జరిగింది. ప్రస్తుతం ఇదే నిబంధనతో పనులు చేసిన కూలీలకు వేతనాలు చెల్లిస్తున్నారు. ఈనేపథ్యంలో పనులు చేసిన వారికే వేతనాలు అందేలా మరింత పారదర్శకత కోసం ప్రస్తుతం జాబ్‌కార్డుకు, ఆధార్‌కు లింక్ అయిన కూలీలను ఈ-కేవైసీ చేసే కార్యక్రమాన్ని ముమ్మరం చేస్తున్నారు. జాబ్‌కార్డులో పేరు ఉండి, ఆధార్ కలిగిన ప్రతీ కూలి ఫొటోతీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి ఈ-కేవైసీ చేస్తున్నారు. దీని ద్వారా పనులకు వచ్చిన వారి ఫొటోలను పని ప్రదేశంలో తీయడం ద్వారా పనులకు వచ్చిన వారికే వేతనాలు అందుతాయని తెలిపారు. ఈ-కేవైసీ ద్వారా బోగస్ కార్డులు, పనులకు రాని కూలీల కార్డులు తొలిగించటం జరుగుతుందన్నారు.

భద్రాద్రిలో 75.25శాతం ఈ-కేవైసీ పూర్తి

భద్రాద్రి జిల్లాలోని 22 మండలాల్లో ఉపాధి పనులు చేసే కూలీలు 2,20,977 మంది ఉన్నారు. ప్రస్తుతం యాక్టివ్‌గా కూలీల జాబ్‌కార్డులను ఈ-కేవైసీ చేసే ప్రక్రియ ముమ్మరంగా సాగుతుంది. క్షేత్రస్థాయి సిబ్బంది కొద్ది రోజులుగా ఇదే పనిలో మునిగిపోయారు. జిల్లాలో 2,20,977మంది కూలీలు ఉండగా ఈనెల 25 నాటికి 1,66,278 మంది కూలీల ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తయింది. భద్రాద్రి జిల్లాలో ఈ-కేవైసీ 75.25శాతంగా జరిగినట్లు అధికార లెక్కలు తెలుపుతున్నాయి. మిగిలిన 25శాతం కూడా ఈనెలాఖరునాటికి పూర్తిచేయాలని ఆదేశించటంతో క్షేత్రస్థాయి సిబ్బంది కూలీల ముఖఫొటోలు తీస్తూ ప్రక్రియను పూర్తిచేస్తున్నారు. మండలాల విషయానికి వస్తే జూలూరుపాడు మండలంలో 11416 మంది కూలీలు ఉండగా 10027 మంది ఈ-కేవైసీ పూర్తిచేశారు. 88.06శాతం చేసి జిల్లాలో మొదటిస్థానంలో ఉంది. చంద్రుగొండలో 83.52శాతం, చుంచుపల్లి, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో 82.48శాతం ఈ-కేవైసీ చేశారు. పాల్వంచలో 80.70శాతం, దుమ్ముగూడెంలో 80.28శాతం ఈ-కేవైసీ చేశారు. జిల్లాలో అత్యల్పంగా సుజాతనగర్ మండలంలో 45.65శాతం ఈ-కేవైసీ చేసినట్లు లెక్కలు తెలుపుతున్నాయి.

ఇక నుంచి ముఖ ఆధారిత హాజరు

ప్రస్తుతం ప్రభుత్వాలు వివిధ శాఖల్లో ముఖ ఆధారిత హాజరును అమలు చేస్తున్నారు. ఇదే తరుణంలో ఉపాధి హామీ పథకంలోనూ దీనిని అమలు చేయాలని నిర్ణయించారు. ఉపాధిలో ఇప్పటివరకు పనులకు వచ్చిన కూలీలను గ్రూపులుగా ఫొటో చేసి, మస్టర్లు వేసి హాజరు నమోదు చేసేవారు. దీంట్లోనే కొన్నిచోట్ల అక్రమాలు జరుగుతున్నట్లుగా గుర్తిస్తున్నారు. ఒకరికి బదులు మరొకరు పనులు చేయటం, రెండు గ్రూపుల్లో ఒకరే ఉండటం వంటివి చోటుచేసుకుంటున్నాయి. ఈనేపథ్యంలో పనులకు వచ్చే కూలీలను పని ప్రదేశం వద్దే ముఖ ఆధారిత హాజరు వేయాలని నిర్ణయించారు.



ఈ-కేవైసీ చేస్తున్న క్షేత్రస్థాయి సిబ్బంది

ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తయితే వచ్చేనెల నుంచి ముఖ ఆధారిత హాజరు వేయనున్నారు. తద్వారా ఎవరెవరు పనులకు వస్తున్నారనే దానిపై స్పష్టత వస్తుంది. తద్వారా పనులు చేస్తేనే వేతనం వస్తుందనేది కూలీలకు తెలుస్తుంది.

ఆదివాసీలకు అన్యాయం చేస్తే సహించేది లేదు

ఆదివాసీ జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర



సమావేశంలో మాట్లాడుతున్న చందా లింగయ్య దొర

మణుగూరు రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : బీటీపీఎస్ నిర్మాణంలో భూములు కోల్పోయిన ఆదివాసీలకు అన్యాయం జరిగితే సహించేది లేదని మాజీ ఎమ్మెల్యే ఆదివాసీ జాతీయ నాయకుడు చందా లింగయ్య దొర హెచ్చరించారు. ఆదివారం మణుగూరు మండలం సాంబాయిగూడెంలో జరిగిన బీటీపీఎస్ ఆదివాసీ నిర్వాసితులతో ఆయన సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్లాంట్ నిర్మాణ సమయంలో ఆదివాసీల నిర్వాసితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అయినప్పటికీ 375 మంది గిరిజనులు నిర్వాసితులుగా ఉన్నప్పటికీ 73 మందికి మాత్రమే ఉద్యోగాలు ఇచ్చి మిగతా ప్యాకేజీను అగ్రకులాలకు అమ్ముకున్నారని ఆరోపించారు. గత టీఆర్ఎస్ ప్రభుత్వంలోనే కాకుండా నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా గిరిజనులకు అన్యాయం జరుగుతుందన్నారు. బీటీపీఎస్‌లో జరుగుతున్న ప్రతి అభివృద్ధి పనుల్లో కూడా గిరిజన వీటీడీప కమిటీలకు అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. యాష్ ప్లాంట్ పనులతో పాటు మిగతా పనులను కూడా సొసైటీలకే అప్పగించాలని.. లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీటీపీఎస్ ఆదివాసీ జేఏసీ నాయకులు చిడెం నాగేశ్వరరావు, మర్రి శంకర్, పూనెం రాజగోపాల్, కుంజ వెంకటరమణ, ఏనిక మంగమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అస్తవ్యస్త పాలన

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం
తక్షణమే స్వస్తి చెప్పాలి
విలేకరుల సమావేశంలో కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల కో ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి

ఖమ్మంబైపాస్‌రోడ్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొనసాగుతున్న అస్థవ్యస్థ పాలనకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనేస్వస్తి చెప్పాలని కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల కో ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మం నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో కాంగ్రెస్ నాయకులు దాడుల సంస్కృతికి నాంది పలికారని, సత్తుపల్లిలో ఇటీవల జరిగిన బీసీ బంద్ కార్యక్రమంలో బీజేపీ నాయకులపై కాంగ్రెస్ గుండాలు దాడులకు పాల్పడడం సరైంది కాదన్నారు. అధికారంలోకి వచ్చేముందు ప్రజలను మభ్యపెట్టి అధికారలోకి వచ్చాక ఇచ్చిన హామీలు గాలికి వదిలేశారని, తక్షణమే ఆరు గ్యారంటీలు అమలుపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నడూలేని విధంగా రాష్ట్రఖజానా ఖాళీగా ఉందని చెబుతూ అప్పులు చేస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారన్నారు. అదే విధంగా ఓట్‌చోరీ అంటూ కాంగ్రెస్ నాయకులు అబద్ధాలు మాట్లాడుతున్నారని, బీజేపీ ఓట్‌చోరీ చేసి ఉంటే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేదా అని ప్రశ్నించారు. జిల్లాలో అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలను గాలికి వదిలేసిన ముగ్గురు మంత్రులు కనీసం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు, ఈవీరమేష్, రవికుమార్, కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, నంబూరి రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీపై పోలీసులకు ఫిర్యాదు

జూలూరుపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమట నర్సాపురంలో ఓ ఇంటి ఎదుట నిలిపిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన ఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈఘటన వివరాలిలా.. పడమటనర్సపురానికి చెందిన విద్యార్థి రెబ్బ లక్ష్మణ్‌కుమార్ కేటీఎం డ్యూక్ అనే ద్విచక్ర వాహనాన్ని తన ఇంటి ఎదుట నిలిపాడు. ఉదయం లేచిన తర్వాత చూస్తే కనిపించలేదు. దీంతో ఆందోళనకు గురై చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించాడు. వాహనం చోరీపై బాధితుడు జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సింగరేణి కార్మికులకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు

స్పెషల్ డ్రైవ్‌కు ఏర్పాట్లు

ఇల్లెందు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థల విశ్రాంత కార్మికులకు ఉచితంగా డిజిటల్ లైఫ్ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు జారీ చేసేందుకు సీపీఆర్ఎంఎస్ మెడికల్ కార్డులు రెన్యూవల్ చేసేందుకు కార్యక్రమాలు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని భారతీయ మజ్దూర్ సంఘ్ బీఎంఎస్ ఉపాధ్యక్షుడు పులి రాజారెడ్డి సింగరేణి పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండా రామాకాంత్ తెలిపారు. ఆదివారం ఈ మేరకు విడుదల చేసిన పత్రిక ప్రకటనలో సింగరేణి కాలరీస్ వ్యాపితంగా నవంబరు నేలలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. చదువులేని విశ్రాంతా కార్మికులు సరైన పద్ధతిలో లైఫ్ సర్టిఫికేట్లు సమర్పించలేని కారాణాలతో వేలాది మంది పెన్షన్‌లు సకాలంలో పొందలేక పోతున్నారని తెలిపారు. ప్రతి సంవత్సరం నవంబరు నేలలో దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థల కార్మికులు 4.50కోట్ల మంది లైఫ్ సర్టిపికేట్లు సమర్పించవలసి ఉందన్నారు. నిరక్షరాస్యులైన కార్మికులకు లైఫ్ సర్టిపికేట్లు సమర్పించడానికి అనేక న్యాయ ప్రయాసాలు ఎదుర్కొంటున్న విషయాన్ని బీఎంఎస్ కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిందని అన్నారు. ఈ మేరకు స్పందించిన కేంద్ర ప్రభుత్వం కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ సీఎంపీఎఫ్ రీజనల్ కమిషనర్ హరిపచారి ఆధ్వర్యంలో సింగరేణి కాలరీస్‌లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సింగరేణి ఇల్లెందులో నవంబరు 11న, కార్పొరేషన్‌లో 6న కొత్తగూడెంలో 14న, మణుగూరులో 19న నమోదులు జరుగుతాయన్నారు. అదే విధంగా రామగుండం 1వ డివిజన్‌లో నవంబరు 3, 4 తేదీల్లో రామగుండం 2వ డివిజన్‌లో 6, 7 తేదీల్లో, రామగుండం 3వ డివిజన్‌లో 10, 11 తేదీల్లో, హైదారాబాద్ శ్రీరాంపూర్ 12, 13తేదీల్లో, మందమర్రిలో 17, 18తేదీల్లో, బెల్లంపల్లిలో 19, 20 తేదీల్లో స్పెషల్ డ్రైవ్ జరుగుతుందన్నారు. కాగా భూపాలపల్లిలో 24, 25 తేదీల్లో, వకీల్‌పల్లిలో 26న గోదావరిఖనిలో సీఎంపీఎఫ్ కార్యలయంలో నవంబరు 3 నుంచి 28వరకు వివిధ రకాలుగా జరుగుతుందని తెలిపారు. సింగరేణిలో పింఛన్ పొందుతున్న కార్మికులపై ఏరియాల్లో ఎప్పుడైన ఈ సదుపాయం వినియోగించుకొవచ్చన్నారు. సెల్‌ఫోన్‌లో కూడా డిజిటల్ లైఫ్ సర్టిపికేట్లు పొందే విషయాలు అధికారులు వివరిస్తారని తెలిపారు. విశ్రాంతి కార్మికులు తమవెంట పీపీవో లెటర్, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌పుస్తకంతో పాటు సెల్‌ఫోన్ తీసుకెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కార్డులు రెన్యూవల్ కూడా జరుగుతుందని, రిటైడ్ కార్మికలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పులిచింతల రాజారెడ్డి, మండా రమాకాంత్‌లు కోరారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత


బాధితుడికి అప్పగించిన మహిళా కండక్టర్



సత్తుపల్లిలో సెల్‌ఫోన్‌ను బాధితుడికి అప్పగిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఓ ప్రయాణీకుడు బస్సులో పోగొట్టుకున్న రూ.45వేల విలువైన సెల్‌ఫోన్‌ను ఆర్టీసీ మహిళా కండక్టర్ తిరిగి అప్పగించిన సంఘటన ఆదివారం సత్తుపల్లిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 25వ తేదీన టీఎస్ 04యూడీ 1819నంబర్ గల బస్సును సత్తుపల్లి బస్టాండ్‌లో ఎక్కిన దేవాదాయ శాఖ ఉద్యోగి పి.వెంకటేశ్వరరావు వీఎం.బంజరలో దిగిపోయాడు. టిక్కెట్లు తీసుకునేందుకు మహిళా కండక్టర్ నాగూల్‌మీరా బీ (ఈ 826937) వెనుకకు వెళ్లగా సీటులో సెల్‌ఫోన్ ఉండటాన్ని గమనించి తనవద్దనే ఉంచుకుంది. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితుడు వెంకటేశ్వరరావు సరైన ఆధారాలు చూపడంతో స్టేషన్ మేనేజర్ ఆనందం, సెక్యూరిటీ కానిస్టేబుల్ చెన్నారావులు ఫోన్‌ను తిరిగి అప్పగించారు. రూ.45 విలువైన సెల్‌ఫోన్ తిరిగి దక్కడంతో బాధితుడు సంతోషం వ్యక్తంచేస్తూ ఆర్టీసీ ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపాడు. నిజాయితీగా సెల్‌ఫోన్‌ను అప్పగించిన మహిళా కండక్టర్ నాగూల్‌మీరా బీని డీఎం ఊటుకూరి సునీత అభినందించారు.

ఉరివేసుకుని వృద్ధుడి ఆత్మహత్యాయత్నం



వృద్ధుడిని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న కుటుంబ సభ్యులు

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం సత్తుపల్లి మండలం రేజర్లలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. కూలి పనులకు వెళ్లే బోళ్ల వెంకటేశ్వర్లు అలియాస్ ఎర్ర వెంకటేశ్వర్లు కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటీనా సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.

గంజాయి రవాణా నిందితుడిపై పీడీ యాక్ట్



బాధితుడికి పీడీ యాక్ట్ నమోదు పత్రం అందిస్తున్న ఇల్లెందు పోలీసులు

ఇల్లెందు టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నిషేధిత గంజాయిని అక్రమంగా రవాణా చేస్తూ పలు పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల్లో నిందితుడిగా ఉన్న ఓ వ్యక్తిపై ఇల్లెందు పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేశారు. ఆదివారం భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు వివరాలు వెల్లడించారు. డీఎస్పీ చంద్రభాను, ఇల్లెందు సీఐ తాటిపాముల సురేష్ ఆధ్వర్యంలో పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. మెహబూబాబాద్ జిల్లా కే.సముద్రం మండలం కాశీరామ్ తండాకు చెందిన సపావత్ వెంకన్న గత కొంత కాలంగా అక్రమార్జనే ధ్యేయంగా నిషేధిత గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నాడు. ఇల్లెందు, భద్రాచలం, హైదరాబాద్ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు అయ్యాయి. ప్రస్తుతం ఖమ్మం సబ్ జైలులో ఉన్న నిందితుడిపై పీడీ యాక్ట్ నమోదు చేసి ఖమ్మం సబ్ జైలు నుంచి చర్లపల్లి జైలుకు తరలించి జైలు అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా ప్రజల్లో నిత్యం చైతన్యం కోసం ప్రచార కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. అసాంఘిక కార్యకళాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి టీటీ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్ ఖమ్మం జిల్లా



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

ఖమ్మం స్పోర్ట్స్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఈనెల 24, 25 తేదీలలో హైదరాబాద్‌లోని డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో ఖమ్మం జిల్లా బాలురు, బాలికల జట్లు సత్తాచాటి ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. నిత్యం సర్దార్ పటేల్ స్టేడియంలో సాధన చేసే షేక్ ఫజల్ స్వర్ణ పతకం సాధించగా, పరిటాల జ్వలిత్ రెండు స్వర్ణ పతకాలు, పిట్టల మోహిత్ క్రిష్ణ ఒక స్వర్ణం, ఒక రజతం, గద్దల సిరి ఒక స్వర్ణం, ఒక రజతం, సౌమ్య స్వర్ణం, ఈలప్రోలు హరి, తరుణ్‌లు స్వర్ణం, కాంస్య పతకాలు, రణధీర్‌రెడ్డి స్వర్ణం, సీతా ప్రజ్ఞన్ స్వర్ణం, చంద్రికారాణి, షర్మిలారాణి రెండు స్వర్ణాలు, ఒక కాంస్య పతకం, ఇమ్మాన్యుయేల్ రజతం, గౌరిశెట్టి చార్విక్ రజత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాలసాని విజయ్, ఓలేటి సాంబమూర్తి (కోచ్) తదితరులు అభినందించారు. భవిష్యత్ పోటీల్లో రాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

మున్నేరులో ఉత్సాహంగా ఈత ర్యాలీ



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న సీనియర్ స్విమ్మర్లు

ఖమ్మంస్పోర్ట్స్, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): మున్నేరు ఈత మిత్రుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం భారీ ఈత ర్యాలీ ఉత్సాహంగా నిర్వహించారు. ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి వద్ద ప్రారంభమైన ర్యాలీ సుమారు 6 కిలోమీటర్లు సాగి ఖమ్మం నగరంలోని కరుణగిరి వద్ద గురుదక్షిణ ఫౌండేషన్ వద్ద ముగిసింది. ర్యాలీలో సుమారు 150 మంది స్విమ్మర్లు పాల్గొని ఉత్సాహపరిచారు. ఈత రాని యువత ఇటీవల కాలంలో నీటి ప్రమాదాల బారిన పడుతున్నారని, ఈత నేర్చుకోవాలంటూ పిలుపునిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో స్విమ్మింగ్ సంఘం బాధ్యులు కోదాటి గిరి, బోజెడ్ల ప్రభాకర్‌రావు, అను ముల రామిరెడ్డి, కమర్తపు గోపాలరావు, మందపల్లి లక్ష్మణ్, బోడేపూడి నాగేశ్వరరావు, దొండపాటి శ్రీనివాసరావు, మాధవ రావు, రమేష్, రాయల మల్లి, చింతనిప్పు రవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

టేకులపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా రెండు మోటారు సైకిళ్లు ఢీకొని నలుగురికి తీవ్ర గాయాలైన సంఘటన టేకులపల్లి- బోడు రహదారిలో మండలంలోని టేకులపల్లిలో దాసుతండా వద్ద ఆదివారం రాత్రి జరిగింది. బొమ్మనపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరో వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన కేలోతు లచ్చిరాం, సక్రు, కేలోతు నర్సింహ మోటారుసైకిల్‌పై మండలంలోని మంగళి తండా నుంచి టేకులపల్లికి వస్తున్న క్రమంలో ఎదురుగా మంలంలోని బర్లగూడెం గ్రామానికి చెందిన యేప నితిన్ టేకులపల్లి నుంచి బోడు వైపు మోటారు సైకిల్‌పై వెళ్లుతూ ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ము గ్గురికి తీవ్ర గాయాలు కాగా ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. బొమ్మనపల్లి వద్ద జరిగిన మరో ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. కొత్తగూడెం నుంచి ఇల్లెందు టీవీఎస్ మోపెడ్‌పై వెళ్తున్న క్రమంలో ఇల్లెందుకు చెందిన పూజారి అబ్రహం ప్రమాదవశాత్తు రోడ్డుపై ఏర్పడిన గుంతలో పడిపోయాడు. ఈ ప్రమాదంలో ఆయన కాలు విరిగింది. క్షతగాత్రులను 108 వాహనం ద్వారా కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అశ్వారావుపేటకు పాదయాత్రగా చేరిన 150 మంది రామభక్తులు

అశ్వారావుపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, ఏలూరు జిల్లా కంద్రికగూడెంకు చెందిన 150 మంది రామభక్తులు పాదయాత్రగా భద్రాచలం వెళుతూ ఆదివారం అశ్వారావుపేటకు చేరుకున్నారు. అశ్వారావుపేటకు చేరుకున్న రామభక్తులకు పట్టణంలోని శ్రీ వాసవికన్యకాపరమేశ్వరి ఆలయ అధ్యక్షులు ఘన స్వాగతం పలికి ఆలయానికి ఆహ్వానించారు. ఆలయంలో పూజలు అనంతరం ఆదివారం రాత్రి భక్తులకు అన్న ప్రసాద వితరణ కావించారు. సోమవారం తెల్లవారుఝామున భక్తులు తిరిగి భద్రాచలంకు పాదయాత్రగా బయలుదేరుతారు.

పిచ్చికుక్క స్వైర విహారం

బాలుడి సహా ఇద్దరికి తీవ్ర గాయాలు



గాయపడిన కార్మికుడు నాగయ్య

కూసుమంచి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీళ్లచెరువు గ్రామంలో పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. బాలుడి సహా గ్రామ పంచాయతీ కార్మికుడిని, మేకలను, గొర్రెలను, పశువులను గాయపర్చింది. బాధితుల కథనం ప్రకారం ఆదివారం ఉదయం బాలుడిని గాయపరిచింది. సాయంత్రం పంచాయతీ కార్మికుడు గోపె నాగయ్యను తీవ్రంగా గాయపరిచింది. చేతులకు, కాళ్లకు, ఇతర శరీర భాగాలపై దాడిచేసి శునకం గాయపరిచింది. బాధితులు యాంటీ రేబీస్ టీకా కోసం ఆసుపత్రికి వెళ్లారు. అదేవిధంగా పలువురు రైతులకు చెందిన పశువులు, గొర్రెలు, మేకలను గాయపరిచింది. ఈ సందర్భంగా వీధికుక్కలను నిర్మించాలని కోరుతున్నారు.

స్కూటీపైనే ప్రాణాలొదిలిన మహిళ

కుక్క అడ్డురావడంతో జాతీయ రహదారిపై ప్రమాదం
ఆగిఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టిన ద్విచక్ర వాహనం
తమ్మిలేరు బ్రిడ్జి వద్ద ఘటన



ప్రమాదస్థలంలో స్వర్ణలత మృతదేహం

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పనితో పాటు వ్యవసాయ పనులను సక్కదిద్దుకుంటూ జీవితంలో వచ్చిన కష్టాలను కూడా లెక్కచేయకుండా పోరాటం చేస్తున్న మహిళను ఓ వీధికుక్క రూపంలో మృత్యువు కబలించింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. సత్తుపల్లిలోని రామాచారి ఆసుపత్రి వీధిలో భార్యభర్తలు మోరంపూడి స్వర్ణలత(56), రామకోటేశ్వరరావులు నివాసం ఉంటున్నారు. వీరికి కుమార్తె నాగశ్రీ యూఎస్‌లో, కుమారుడు నాగశ్యామ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా స్థిరపడ్డారు. అయితే భర్తకు కొన్నేళ్ల క్రితం బ్రెయిన్ ఆపరేషన్ జరగగా.. అతను ఇంటి వద్దనే ఉంటుండగా భార్య స్వర్ణలత ఇంటి పనులతో పాటు వ్యవసాయాన్ని సైతం చేసుకుంటుంది. ఈ మేరకు వ్యవసాయ పనుల నిమిత్తం దమ్మపేట మండలం రెడ్యాలపాడు గ్రామంలోని పామాయిల్ తోటలను పరిశీలించిన అనంతరం ఆమె స్వగ్రామానికి స్కూటీపై తిరిగి వస్తుండగా తాళ్లమడ అనంతరం తమ్మిలేరు బ్రిడ్జి వద్దకు రాగా ఓ కుక్క అడ్డువచ్చింది. దీంతో తన ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఆగివున్న లారీ వెనుక భాగంలో గట్టిగా ఢీకొట్టడంతో వాహనంతో పాటు ఆమె శరీరం కూడా లారీ బాడీకింద ఇరుక్కోవడంతో అక్కడికక్కడే మృతి చెందింది.

మృతదేహాన్ని బయటకు తీసిన 108 సిబ్బంది

లారీ వెనుక భాగాన్ని అతివేగంగా ఢీకొనడంతో స్కూటీతో పాటు స్వర్ణలత కూడా లారీ బాడీకింద ఇరుక్కుపోయి మృతిచెందింది. ప్రమాద స్థలానికి చేరుకున్న 108 వాహన సిబ్బంది ఈఎంటీ గొల్లమందల కృష్ణ, పైలట్ రాజులపాటి రాధాకృష్ణలు తమ వాహనంలోని పనిముట్లు, కట్టర్ల సహాయంతో అత్యంత కష్టంమీద వాహనంతో పాటు స్వర్ణలత మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్వర్ణలత మృతితో పుట్టినిల్లు నారాయణపురం, అత్తవారిల్లు శ్రీరాంపురం, స్వగ్రామం సత్తుపల్లిలో విషాదం అలముకుంది. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కృష్ణారావుకు తెలుగు మాతృశ్రీ పురస్కారం



ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరానికి చెందిన కొత్తపల్లి కృష్ణారావుకు తెలుగు మాతృశ్రీ వైద్య సేవా పురస్కారం అందుకున్నారు. ఆదివారం ఖమ్మంలో తెలుగు కళారత్నాలు సాంస్కృతిసేవా సంస్థ, తెలుగుభాష కల్చరల్ అసోసియేషన్ తిరుపతికి చెందిన అంతర్జాతీయ సేవాసంస్థల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఖమ్మంలో జరిగిన ఈకార్యక్రమానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపుకార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకరరెడ్డి హాజరై పురస్కారాలు అందించారు.

క్యాన్సర్ వైద్య శిబిరంలో 200 మందికి వైద్యపరీక్షలు

» ఒకరికి నిర్ధారణ, 20మందికి లక్షణాలు

నేలకొండపల్లి, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లి భక్తరామదాసు సర్వీస్ సొసైటీ, నూతక్కి గంగాధరరావు ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నేలకొండపల్లిలోని రావెళ్ళ భవన్‌లో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరం విజయవంతమైంది. దాదాపు 200మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఒక్కరికి వ్యాధి ఉన్నట్లుగా నిర్ధారించారు. మరో 20మందికి లక్షణాలు ఉన్నట్లుగా తేలినట్లు సమాచారం. టి.రాఘవేందర్‌రెడ్డి, రేడియేషన్, అంకాలజిస్టు,శ్యాం, సుపర్ణలత, కిరణ్‌సింగ్ శిబిరంలో రోగులను పరీక్షించారు. డాక్టర్ రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవన విధానమే మన ఆరోగ్యాన్ని కాపాడుతుందన్నారు. గుట్కా, ధూమ, మద్యపానం, పాన్ పరాగ్‌లాంటి వాటి జోలికి వెళ్ళవద్దన్నారు. బయటి ఆహారం కంటే ఇంటి ఆహారానికే ఎక్కువ ప్రాధాన్యతనివ్వాలన్నారు. రోగులకు పరీక్షలు చేయటంలో వైద్యులకు గ్రామీణ వైద్యులు సహకరించారు.భక్తరామదాసు సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు ఏటుకూరి వెంకటరామారావు, కార్యదర్శి గెల్లా వెంకటరమణగుప్తా, మాజీ అధ్యక్షుడు వెల్లంపల్లి శ్రీనివాస్, పొన్నగాని శ్రీనివాస్,యలమద్ది లెనిన్, కోశాధికారి దండా రవీంద్రబాబు, కోడూరి వెంకటాచారి, పచ్చా తిరుపతయ్య, రాయల రమేష్, ఎన్టీఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఏటుకూరి రామారావు, కార్యదర్శి కొప్పుల వెంకట్రామిరెడ్డి, ఓరుగంటి నారాయణరావు, వాసం లక్ష్మయ్య, చావా గణపతిరావు, నంచర్ల దేవీప్రసాద్, తెల్ల గొర్ల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు. వలంటీర్లుగా సేవలు అందించారు.




రోగులను పరీక్షిస్తున్న వైద్యులు, ఉచిత వైద్యశిబిరానికి హాజరైన రోగులు

మరుగుదొడ్ల అధ్వానం

» జిల్లా ప్రభుత్వాస్పత్రిలో అధ్వానంగా మూత్రశాలలు
» ముక్కుమూసుకుని విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు
» మహిళా ఉద్యోగులు, రోగులకు తప్పని తిప్పలు

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా మారింది. కలెక్టర్, అదనపు కలెక్టర్ పలుమార్లు ఆస్పత్రిని సందర్శించి రోగులకు, సిబ్బందికి మరుగుదొడ్ల మరమ్మత్తుల కోసం నిధులు కేటాయిస్తున్నా... ఎక్కడా మరుగుదొడ్ల నిర్వహణ బావుండడం లేదు. ఆ ప్రాంతానికి వెళ్లాలంటేనే సిబ్బంది,రోగులు హడలిపోతున్నారు. రక్తనమూనాల సేకరించే విభాగంలో ఉన్న మరుగుదొడ్లు అధ్వానంగా మారాయి. ఇక్కడ దుర్వాసనకు ముక్కుమూసుకుని విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రక్త నమూనాల సేకరించేందుకు ల్యాబ్‌టెక్నీషియన్లు, క్లీనికల్ ట్రెనింగ్ సిబ్బంది మహిళలు విధులు నిర్వహిస్తున్నారు. ప్రతీ షిఫ్టులోనూ కనీసం ఐదుగురు చొప్పున విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ రెండు మరుగుదొడ్లు ఉన్నాయి. వీటిని బాగు చేసే నాథుడే కరువయ్యారు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. చూడడానికే జుగుప్సాకరంగా ఉందని దీన్ని వినియోగించాలంటే హడలిపోవాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇక్కడికి విధుల్లోకి వచ్చిన మహిళా సిబ్బంది మళ్లీ ఇంటికి వెళ్లాకనే... తమ పని చేసుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనూ ఆస్పత్రి అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇక్కడే కాకుండా ఫార్మసీ విభాగంలోనూ అక్కడ పని చేసే మహిళలకు సరిపడిన మరుగుదొడ్లులేకరు. రక్తనమూనాలు సేకరించే విభాగంలో ప్రతి రోజు కనీసం 1500 నుంచి 2వేల మంది తమ రక్తాన్ని శాంపుల్స్ రూపంలో ఇవ్వడానికి వరుస కడుతున్నారు. ఇక్కడ గందరగోళమైన పరిస్థితులుంటున్నాయి. ఇక్కడ కూడా ఒక సెక్యూరిటీ గార్డును నియమిస్తే రోగుల నుంచి ఇబ్బందులు లేకుండా సిబ్బంది విధులు నిర్వహించే అవకాశం ఉంటుందన్నారు.



అధ్వానంగా ఉన్న మరుగుదొడ్డి



రక్త శాంపిళ్ల సేకరణ వద్ద విధులు నిర్వహిస్తున్న మహిళా సిబ్బంది

నూతన విద్యావిధానం నిలుపుదల చేయాలి

ఖమ్మంఅర్బన్,అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల మెదళ్లలో మతతత్వ విష బీజాలు నాటే నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణకేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం సీపీఐ జిల్లా కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన ఎస్ఎఫ్ఐ నగరముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం నూతనంగా పీఎం శ్రీస్కూల్స్ పేరుతో నూతన విద్యావిధానాన్ని తీసుకు వచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా పీఎంశ్రీ స్కూళ్ల ఏర్పాటును ప్రభుత్వం వ్యతిరేకించాలన్నారు. దేశవ్యాప్తంగా విద్యావేత్తలు మేధావులు ఈ విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. పీఎంశ్రీ స్కూళ్లను ఉపసంహరించుకోకపోతే దేశ వ్యాప్త ఆందోళనలు నిర్వహిస్తామన్నారు.కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు శివ, వంశీ. జిల్లా నాయకులు గోపి, పవన్, నరేందర్ పాల్గొన్నారు.

నష్టపరిహారం అందించాలి: సీపీఐ

ఖమ్మంఅర్బన్, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): పత్తిరైతులను కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు ఆదుకోవాలని సీపీఐ జిల్లానాయకుడు చింతల రమేష్ అన్నారు. రఘునాథపాలెం మండలంలో అధిక వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంటలను ఆదివారం సీపీఐ బృందం పరిశీలించింది. సీసీఐ నిబంధనలు సడలించి పత్తిని కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి జూల వెంకటేశ్వర్లు,పొద్దుటూరు వెంకటరెడ్డి, గాడిచర్ల సత్యనారాయణ, రాచర్ల లక్ష్మీనారాయణ, కాళంగి చిన్నపిచ్చయ్య పాల్గొన్నారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

కేఎంసీ కాంట్రాక్టర్ల కమిటీపై ముందడుగు

» 14మందితో అడ్‌హక్ కమిటీ సమావేశం
» పదేళ్ల తర్వాత ప్రక్రియ ప్రారంభం

ఖమ్మంకార్పొరేషన్,అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలో పదేళ్ల తర్వాత కాంట్రాక్టర్ కమిటీ ఎన్నిక ప్రక్రియ ప్రారంభమైంది. ఆదివారం నగరంలో సమావేశమైన కేఎంసీ కాంట్రాక్టర్లు కమిటీ ఎన్నిక జరపాలని నిర్ణయించారు. ఈమేరకు సింహారెడ్డి, పసుపులేటి వెంకటేశ్వర్లు,తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, రాయల సీతయ్య, జోగల్ కిషోర్, కుంచపు వెంకటేశ్వర్లు, తుమ్మా అప్పిరెడ్డి, పోనుగోటి శ్రీధర్, పాలకుర్తి కృష్ణ,తిరుమలరావు, కొత్త రవికుమార్, రావూరి రమేష్, దండగల రాంబాబు, వెంకటాద్రినాయుడుతో అడహక్ కమిటీని ప్రకటించారు. త్వరలో జరగబోయే కాంట్రాక్టర్లు ఎన్నిక పోటా పోటీగా జరిగే అవకాశం కనిపిస్తోంది. ఖమ్మం నగరంలో జరిగే అభివృద్ధి పనుల వేగవంతంలో కాంట్రాక్టర్లు పాత్ర ఎంతో కీలకంగా ఉంటుంది. అయితే ఇటీవల కాలంలో కొన్ని పనులకు ఖమ్మం నగర పాలక సంస్థ పదేపదే టెండర్లు పిలవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఒకేపనికి 15సార్లు టెండర్లు పిలుస్తున్నారు. కాగా ఖమ్మం నగర పాలక సంస్థలోని ఇంజనీరింగ్ అధికారులు కొంతమంది కాంట్రాక్టర్లుకు సానుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలతో కొత్త కమిటీ ఎన్నిక వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. కొంతమంది ఇంజనీరింగ్ అధికారులు ఒక్కో కాంట్రాక్టర్‌కు ఒక్కో రీతిగా అభివృద్ధి పనుల విషయంలో సహకరిస్తున్నారని కాంట్రాక్టర్ల మధ్య చర్చ జరుగుతుంది. కొంతమంది కాంట్రాక్టర్లు నాణ్యత లేకుండా పనులు చేసినా పట్టించుకోవటం లేదని, వారికి అనుకూలంగా ఉండే ఏఈలను తరుచూ మారుస్తున్నారని గతనెల రోజులుగా కాంట్రాక్టర్లు మధ్య తీవ్రస్థాయిలో చర్చ జరిగింది. చివరకు కాంట్రాక్టర్లు మధ్య చీలకకు కారణమైంది. ఇది పదేళ్ల తర్వాత కొత్తకమిటీ ఎన్నిక జరిపేందుకు నాంది పలికింది.



సమావేశమైన కాంట్రాక్టర్లు

పశుసంవర్ధకశాఖ ఉద్యోగుల సంఘం ఎన్నిక



మాట్లాడుతున్న బిక్కు

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ నాల్గోతరగతి ఉద్యోగుల సంఘం పశుసంవర్ధకశాఖ జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎండీ ఇమ్రాన్, సహాయ అధ్యక్షుడిగా జి.శ్రీనివాస్, ఎండీ.నహీంపాషా, కె.లక్ష్మీ, ప్రధాన కార్యదర్శిగా ఎన్.మురళీమోహన్ కోశాధికారిగా ఏ.గిరిప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గాన్ని పలువురు అభినందించారు. ఉద్యోగుల సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పి.వెంకటరమణ, ప్రచార కార్యదర్శి చావా నారాయరాణరావు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ప్రమాణస్వీకారం

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): నగరంలోని చైతన్యనగర్ శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయం కమిటీ ప్రమాణస్వీకారం ఆదివారం ఆలయంలో ఘనంగా నిర్వహించారు. చైర్మన్‌గా మేకల హనుమంతరావు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసరెడ్డి, కోశాధికారిగా మధుతో పాటు 12మంది సభ్యులచే దేవస్థాన ప్రధాన అర్చకుడు నారాయణ నంబూద్రి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం నిర్వహించారు. అనంతరం మండల పూజలకుసంబంధించి నవంబరు 15నుంచి 41రోజుల వరకు అన్నదాన కార్యక్రమం నిరవహిస్తున్నట్లు నూతన కమిటీ తెలిపింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చావా మధురి నారాయణరావు, సరిపుడి సతీష్, వల్లభనేని రామారావు పాల్లన్నారు.

అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు

ఖమ్మం ఖానాపురంహవేలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మహిళకు కుటుంబ సభ్యుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు. నగరంలోని ప్రకాషనగర్ నివాసంలో ఉండే జమున(60) అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె భర్త నాలుగేళ్ల క్రితం మృతి చెందగా కూతురు,కుమారుడు ఉన్నారు. పేద కుటుంబం కావడంతో సొంత ఇల్లు లేకపోవడంతో కిరాయికిఉన్న వారు అభ్యంతరం తెలపడంతో స్థానికులు అన్నం శ్రీనివాసరావుకు సమాచారం అందించారు. దీంతో అన్నం శ్రీనివాసరావు బల్లేపల్లి వైకుంఠధామంలో అంత్యక్రియలునిర్వహించారు.

క్రీడాకారుడికి ఆర్థికసాయం అందజేత

ఖమ్మంఅర్బన్,అక్టోబరు26(ఆంధ్రజ్యోతి):నగరంలోని జూబ్లిపురకు చెందిన క్రీడాకారుడు కొండెశివశంకర్‌కు స్థానికులు ఆర్థిక సాయం అందించారు. గోవాలో నవంబరు 8నుంచి10వరకు జరుగనున్న పరుగు పందెం పోటీల్లో జాతీయ జట్టు తరపున ఆయన ఆడనున్నారు. ప్రయాణ ఖర్చులు లేక ఇబ్బంది పడుతున్నాడు. ఈవిషయం తెలిసి 46వ డివిజన్ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ క్రీడాకారుడిని ఆదుకోవాలని విన్నవించారు. దీంతో నల్లమల వెంకటేశ్వరరావు, కర్నాటి వీరభద్రం, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు షేక్ రజ్జీ రూ.10వేలు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు తొగరు భాస్కర్, రామకృష్ణ,మస్తాన్,మంగ, శ్రీశైలం పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలి

ఖమ్మంఅర్బన్ అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అధిక వర్షాల వల్ల నష్ట పోయిన రైతులకు ప్రభుత్వం తగిన నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం నాయకుడు బండి రమేష్ అన్నారు. ఆదివారం సీపీఎం జిల్లా కార్యాలయం సుందరయ్య భవనంలో నందిగామ కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. అకాల వర్షాల కారణంగా ఈ ఏడాది పత్తి, వరి తదితర పంటలు విపరీతంగా దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎర్రశ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యుడు షేక్ బషీరుద్దీన్, సుదర్శన్ రెడ్డి, నంద్ర ప్రసాద్, గొడవర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేశ్వాపురం గ్రామస్థుల కార్తీక వనభోజనాలు



కూసుమంచి,అక్టోబరు26(ఆంధ్రజ్యోతి):దూరంగా ఉన్నా మనసులోనే మన ఊరు.. అనే సత్యాన్ని చాటుతూ.. హైదరాబాద్‌లో నివసిస్తున్న కేశ్వాపురం గ్రామస్థులు ఆదివారం కార్తీకమాస వనభోజనాన్ని ఆనందోత్సవాల నడుమ నిర్వహించారు. ఆదిభట్లలో పచ్చనిచెట్ల నడుమ గ్రామీణ వాతావరణాన్ని తలపించేలా కార్యక్రమం నిర్వహించారు. ఆటలు, పాటలు, సరదా పోటీలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ప్రతిఒక్కరూ ఊరిబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అనంతరం వనభోజనాలు నిర్వహించారు.కార్యక్రమంలో ఆదిభట్ల మున్సిపల్ కమిషనర్ నల్లమల్ల బాలకృష్ణ, శైలజ, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

31న మెగా రక్తదాన శిబిరం

నేలకొండపల్లి, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరుల స్మారకార్థం ఈనెల 29న జరుప తలపెట్టిన మెగారక్తదాన శిబిరాన్ని ఈనెల 31కి మార్చినట్లు నేలకొండపల్లి ఎస్ఐ పెంటరి సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక కమిటీ ఎన్నిక

ఖమ్మంచర్చికాంపౌండ్, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రనాయీబ్రాహ్మణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా తూముల నాగభూషణం, ప్రధాన కార్యదర్శిగా ఆలేటి సత్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఐక్యవేదిక రాష్ట్ర రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంగుల శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జి.హరిప్రసాద్ ఆదివారం ప్రకటనలో తెలిపారు.శనివారం కొందరు సంఘం సభ్యులకు తెలియకుండా కమిటీని ఎన్నుకున్నారని ఆ కమిటీని రద్దు చేశారు. ఆదివారం నూతన కమిటీ ప్రకటించామని తెలిపారు.

వైరా సీఐగా వెంకటప్రసాద్

వైరా,అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): వైరా సీఐగా ఆదివారం వై.వెంకటప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఇంతకాలంగా వైరా సీఐగా పనిచేసిన నునావత్ సాగర్ కారేపల్లి సీఐగా బదిలీపై వెళ్ళారు. వైరా స్టేషన్ బాధ్యతలు చేపట్టిన వెంకట ప్రసాద్‌కు పలువురు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

తొలిదశలో గుర్తిస్తే క్యాన్సర్ నుంచి బయటపడొచ్చు

» సీనియర్ రేడియేషన్ ఆంకాలజిస్ట్ సుధాకర్
» అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తొలిదశలో గుర్తిస్తే క్యాన్సర్ ముప్పు నుంచి బయటపడొచ్చని జెమ్‌కేర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ సీనియర్ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ కె సుధాకర్ అన్నారు. జెమ్‌కేర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ముందస్తు పరీక్షలు, స్క్రీనింగ్ క్యాన్సర్ తొలిదశలో గుర్తించొచ్చన్నారు. ప్రత్యేకంగా మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. జిల్లాలో అవగాహన లోపం కారణంగా ఎంతో మంది క్యాన్సర్ బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అవగాహన లేమి కారణంగా మూడు, నాలుగో దశల్లో మాత్రమే ఆస్పత్రులకు వస్తున్నారని అన్నారు. దీంతో చికిత్స కష్టం అవుతుందన్నారు. ఇక నుంచి అయినా క్యాన్సర్‌పై పూర్తి అవగాహన కల్పించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మెడికల్ అంకాలజిస్టు నుక్కసాని సుబ్బారావు, సర్జికల్ ఆంకాలజిస్ట్ వి మారుతి, శంకర్‌రెడ్డి, డాక్టర్ కె మోహన్‌రెడ్డి, సీనియర్ న్యూక్లియర్ మెడిసిన్ సుబ్రహ్మణియం, అంకోపాథాలజిస్ట్ అమృత తదితరులు పాల్గొన్నారు.

మరింత సౌకర్యంగా లకారం ట్యాంక్‌బండ్ అభివృద్ధి

» మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మంకార్పొరేషన్,అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర ప్రజలు ఆహ్లాదకరంగా సేద తీరేందుకు ఖమ్మం లకారం ట్యాంక్‌బండ్‌ను మరింత సౌకర్యవంతంగా అభివృద్ధి చేస్తామని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. ఆదివారం లకారం ట్యాంక్‌బండ్‌ను మేయర్ తనిఖీ చేశారు. వాకింగ్ ట్రాక్, లైటింగ్, డ్రైయినేజీలు, మరుగుదొడ్లు పరిశీలించారు. ఈ సందర్భంగా లకారం ట్యాంక్ బండ్ వద్దకు వచ్చిన వారితో మాట్లాడారు. ప్రజాభిప్రాయం సేకరించారు. వర్షంవస్తే తడిసిపోతున్నామని వాకర్స్, పర్యటకుల కోసం షెడ్‌నిర్మాణం చేయాలని, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని వాకర్స్ పలు సమస్యలను మేయర్ పునుకొల్లు నీరజ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ వాకింగ్ ట్రాక్ మరమ్మతులు చేయిస్తామన్నారు. తాగునీరు, విద్యుత్ లైటింగ్, ఇతర సమస్యలు పరిష్కరిస్తామన్నారు. షెడ్‌నిర్మాణంపై త్వరలో నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని మేయర్ హామీ ఇచ్చారు. కేఎంసీ ఉద్యాన అధికారి బెల్లం రాధిక వెంటున్నారు.



వాకర్స్‌తో మాట్లాడుతున్న మేయర్ నీరజ

ఎల్ఐసీ మహాసభలను జయప్రదం చేయండి

ఖమ్మంఅర్బన్ అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నవంబరు 8,9 తేదీల్లో ఖమ్మం నగరంలో జరుగనున్న ఎల్ఐసీ ఏఓఐ యూనియన్ సౌత్ సెంట్రల్ జోన్ మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మహాసభల విజయవంతం కోసం ఆదివారం ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో జరిగిన ఎల్ఐసీ ఏఓఐ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇన్సూరెన్స్ ప్రీమియం మీద గతంలో జీఎస్టీ వేయగా దానిని ఎత్తివేయాలని, గతంలో అనేక ఆందోళనలు నిర్వహించిన ఫలితంగా జీఎస్టీ పూర్తిగా ఎత్తివేయటం జరిగిందన్నారు. మహాసభల విజయవంతం కోసం ఏజెంట్ మిత్రులు, ఉద్యోగులు, పాలసీ దారులు తమవంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు దొంగలతిరుపతి రావు, ఎల్ఐసీ ఏఓఐ బ్రాంచ్ కార్యదర్శి పి. వెంకటరమణ, గంగనబోయిన ఎర్రయ్య, వజ్జమల్లి ఖార్జున్ మందపల్లి సురేష్, బొడ్డుశ్రీనివాసరావు, కెవినమీన్ తదితరులు పాల్గొన్నారు.



దేవాలయాలు.. సామాజిక చైతన్యానికి కేంద్రాలు

» బుద్ధవనం ప్రాజెక్ట్ సీఈఓ శివనాగి రెడ్డి

మధిర, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దేవాలయాలు కేవలం భగవంతుడికి, భక్తికి నిలయాలు మాత్రమే కాదని అవి సామాజిక చైతన్యానికి కేంద్రాలని ప్రముఖ స్థపతి, చరిత్రకారుడు, పురాతత్వ శాస్త్రవేత్త, రాష్ట్ర ప్రభుత్వ బుద్ధవనం ప్రాజెక్ట్ సీఈఓ డా.ఈమని శివనాగిరెడ్డి అన్నారు. ఆదివారం మధిర రైల్వే స్టేషన్ లోని శ్రీ కొదండరామస్వామి దేవాలయాన్ని సందర్శించి పునర్ నిర్మాణానికి మ్యాపును అందచేసి పలు సూచనలు చేసారు. పూర్వ కాలం నుండి ప్రతి గ్రామంలో బడి, గుడి నిర్మాణానికి ప్రాదాన్యత ఇచ్చే వారిని బడి జీవన స్థితిగతులు మారిస్తే గుడి సామాజిక చైతన్యానికి కేంద్రం గా ఉండేదని అన్నారు. గుడికి కులాలకు అతీతంగా ప్రజలందురు చేరి దేవునికి పూజలు చేయటమే కాకుండా అక్కడ జరిగే ఉత్సవాల్లో అందరు భాగస్వాములై మంచీ చెడులు మాట్లాడుకునే వారని అన్నారు. దీనితో ప్రజల మధ్య తరతమ బేదం లేకుండ కలిసి మెలిసి జీవించడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడేయని అన్నారు. అనేక దేవాలయాలను పరిస్తితులకు అనుగుణంగా జీర్ణోద్దరణ చేయటం జరిగిందని మధిర రామాలయం కూడ రోడ్ల ఎత్తు పెరగటంతో గుడి పల్లం అయ్యిందని అద్భుతమైన స్థలం ఈ గుడికి ఉందని ఓ ప్రక్క రైల్వే స్టేషన్ మరో ప్రక్క బస్టాండ్ ఉండటం వల్ల ప్రజలకు ఉపయోగంగా ఉంటుందని దీనిని పునర్ నిర్మాణం చేస్తే మంచి ఆదరణ లభిస్తుందని మరో వందేళ్ల విరాసిల్లుతుందని అన్నారు. ఇప్పుడు దేవాలయం ఉన్న చోటునే తూర్పు ముఖంగా నూతన గర్భాలయం, అంతరాలయంతో పాటు మహామండపం, ఉత్తరాన శివాలయం, తూర్పున ఏకశిల ఆంజనేయ విగ్రహం, దక్షిణాన కళ్యాణ వేదిక నిర్మాణం చేపట్టాలని సూచించారు. మధిర పేరు లోనే మధురం ఉందని ఇదొక చారిత్రక పట్టణం అని ఇక్కడ ఐదు కోట్ల సంవత్సరాల క్రితమే జీవం ఉన్నట్లు ఆణవాళ్లు కనిపిస్తున్నాయని, ఇంతటి మంచి కార్యక్రమంలో పాలు పంచుకునేందుకు వచ్చిన ప్రతి ఒక్కరు అంతే కలిసి కట్టుగా ఆలయ పునర్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో శిల్పి బీమిరెడ్డి వెంకటరెడ్డి, కోనా జనార్ధన్ రావు, మల్లాది వాసు, కళ్యాణపు పుల్లారావు, పాటిబండ్ల సత్యంబాబు, అంజనేయ ప్రసాద్, సూరంశెట్టి కిషోర్, పుతుంబాక కృష్ణప్రసాద్, గుర్రం రామారావు, సీతరాంరెడ్డి, కర్నాటి రామారావు, భాను అర్చకులు పాల్గొన్నారు.

రేపు అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన

మధిర, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మధిర డివిజన్ లోని 43 కోట్ల రూపాయలతో విద్యుత్ శాఖ చేపట్టే పలు అభివృద్ధి పనులకు ఈనెల28న ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేయనున్నారని వైరా డీఈ బండి శ్రీనివాస రావు ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఈ నెల 28న ఉదయం ఎర్రుపాలెం మండలం రేమిడిచర్లలో 3 కోట్లతో నిర్మించే సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేస్తారని అనంతరం మధిర పట్టణంలో 28 కోట్లతో చేపట్టే భూగర్భ విద్యుత్ లైన్ల పనులకు, 3 కోట్లతో మడుపల్లిలో నూతనంగా నిర్మించనున్న సబ్ స్టేషన్ పనులకు జిలుగుమాడు సబ్ స్టేషన్ వద్ద శంకుస్థాపన చేస్తారని అన్నారు. అనంతరం బోనకల్ మండలంలోని బ్రాహ్మణపల్లి, లక్ష్మీపురం, చిరునోముల గ్రామాల్లో 9 కోట్లతో చేపట్టే మూడు నూతన సబ్ స్టేషన్ పనులకు శంకుస్థాపన చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ సీఎండి వరుణ్‌రెడ్డి ఇతర ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.

దేవాలయాలు.. సామాజిక చైతన్యానికి కేంద్రాలు

▸ బుద్ధవనం ప్రాజెక్ట్ సీఈఓ శివనాగి రెడ్డి

మధిర, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దేవాలయాలు కేవలం బగవంతుడికి, భక్తికి నిలయాలు మాత్రమే కాదని అవి సామాజిక చైతన్యానికి కేంద్రాలని ప్రముఖ స్థపతి, చరిత్రకారుడు, పురాతత్వ శాస్త్రవేత్త, రాష్ట్ర ప్రభుత్వ బుద్ధవనం ప్రాజెక్ట్ సీఈఓ డా.ఈమని శివనాగి రెడ్డి అన్నారు. ఆదివారం మధిర రైల్వే స్టేషన్ లోని శ్రీ కొదండరామస్వామి దేవాలయాన్ని సందర్శించి పునర్ నిర్మాణానికి మ్యాపును అందచేసి పలు సూచనలు చేసారు. పూర్వ కాలం నుండి ప్రతి గ్రామంలో బడి, గుడి నిర్మాణానికి ప్రాదాన్యత ఇచ్చే వారిని బడి జీవన స్థితిగతులు మారిస్తే గుడి సామాజిక చైతన్యానికి కేంద్రం గా ఉండేదని అన్నారు. గుడికి కులాలకు అతీతంగా ప్రజలందురు చేరి దేవునికి పూజలు చేయటమే కాకుండా అక్కడ జరిగే ఉత్సవాల్లో అందరు బాగస్వాములై మంచీ చెడులు మాట్లాడుకునే వారని అన్నారు. దీనితో ప్రజల మద్య తరతమ బేదం లేకుండ కలిసి మెలిసి జీవించడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడేయని అన్నారు. అనేక దేవాలయాలను పరిస్తితులకు అనుగుణంగా జీర్ణోద్ధరణ చేయటం జరిగిందని మధిర రామాలయం కూడ రోడ్ల ఎత్తు పెరగటంతో గుడి పల్లం అయ్యిందని అద్భుతమైన స్థలం ఈ గుడికి ఉందని ఓ ప్రక్క రైల్వే స్టేషన్ మరో ప్రక్క బస్టాండ్ ఉండటం వల్ల ప్రజలకు ఉపయోగంగా ఉంటుందని దీనిని పునర్ నిర్మాణం చేస్తే మంచి ఆదరణ లబిస్తుందని మరో వందేళ్ల విరాసిల్లుతుందని అన్నారు. ఇప్పుడు దేవాలయం ఉన్న చోటునే తూర్పు ముఖంగా నూతన గర్బాలయం, అంతరాలయం తో పాటు మహామండపం, ఉత్తరాన శివాలయం, తూర్పున ఏకశిల ఆంజనేయ విగ్రహం, దక్షిణాన కళ్యాణ వేదిక నిర్మాణం చేపట్టాలని సూచించారు. మధిర పేరు లోనే మధురం ఉందని ఇదొక చారిత్రక పట్టణం అని ఇక్కడ ఐదు కోట్ల సంవత్సరాల క్రితమే జీవం ఉన్నట్లు ఆణవాళ్ళ కనిపిస్తున్నాయని, ఇంతటి మంచి కార్యక్రమంలో పాలు పంచుకునేందుకు వచ్చిన ప్రతి ఒక్కరు అంతే కలిసి కట్టుగా ఆలయ పునర్ నిర్మాణంలో బాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో శిల్పి బీమిరెడ్డి వెంకటరెడ్డి పట్టణ ప్రముఖులు కోనా జనార్ధన్ రావు, మల్లాది వాసు, కళ్యాణపు పుల్లారావు, పాటిబండ్ల సత్యం బాబు, అంజనేయ ప్రసాద్, సూరంశెట్టి కిషోర్, పుతుంబాక కృష్ణప్రసాద్, గుర్రం రామారావు, సీతరాంరెడ్డి, కర్నాటి రామారావు, భాను అర్చకులు సందీప్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



దేవాలయ పునర్ నిర్మాణ వివరాలను మ్యాప్ ద్వారా వివరిస్తున్న శివనాగి రెడ్డి

రేపు అభివృద్ధి పనులకు
డిప్యూటీ సీఎం శంకుస్థాపన

మధిర, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మధిర డివిజన్ లోని 43 కోట్ల రూపాయలతో విద్యుత్ శాఖ చేపట్టే పలు అభివృద్ధి పనులకు ఈ నెల 28వ తేదీన ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేయనున్నారని వైరా డీఈ బండి శ్రీనివాస రావు ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఈ నెల 28న ఉదయం 11 గంటలకు ఎర్రుపాలెం మండలం రేమిడిచర్లలో 3 కోట్లతో నిర్మించే నూతన సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేస్తారని అనంతరం మధిర పట్టణంలో 28 కోట్లతో చేపట్టే భూగర్భ విద్యుత్ లైన్ల పనులకు, 3 కోట్లతో మడుపల్లిలో నూతనంగా నిర్మించనున్న సబ్ స్టేషన్ పనులకు జిలుగుమాడు సబ్‌స్టేషన్ వద్ద శంకుస్థాపన చేస్తారని అన్నారు. అనంతరం బోనకల్ మండలంలోని బ్రాహ్మణపల్లి, లక్ష్మీపురం, చిరునోముల గ్రామాల్లో 9 కోట్లతో చేపట్టే మూడు నూతన సబ్ స్టేషన్ పనులకు శంకుస్థాపన చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ సీఎండి వరుణ్ రెడ్డి ఇతర ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.

నిర్మాణం జరిగి రెండేళ్లు.. నేటికీ విద్యుత్ సౌకర్యం కరువు



కారేపల్లి అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని భజ్యాతండాలో దాతలు ఇచ్చిన 20కుంటల భూమిలోరూ.20లక్షల వ్యయంతో నిర్మాణం జరిగి రెండేళ్లయిన గ్రామ పంచాయతీ కార్యాలయానికి అధికారులు విద్యుత్‌సౌకర్యం కల్పించకపోవడంతో పలువురుగ్రామస్థులు అధికారుల పనితీరును ప్రశ్నిస్తున్నారు. గతంలో ఉమ్మడి పంచాయతీ విశ్వనాధపల్లిలో ఉన్న భజ్యతండాను, అధికారులు భజ్యతండా పంచాయతీగా ఏర్పాటు చేశారు. పంచాయతీకి మొట్టమొదటిసారిగా సర్పంచ్‌గా గెలుపొందిన బాణోత్ సంధ్యరాందాస్ పంచాయతీకి సొంతభవనం వుండాలనే ఉద్దేశంతో జిల్లా కలెక్టర్‌ను కలిసి గ్రామానికి చెందిన అజ్మీర లాల్‌సింగ్, అజ్మీరహేమ్లా, అజ్మీరభీమ్లా అందజేసిన 20కుంటల స్థలంలో భవనం నిర్మాణం పూర్తిచేసి, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ చేతులమీదుగా ప్రారంభించారు. అయిన ఇంతవరకు విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడంతో కార్యాలయంలో పనులు చేసుకోవాడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తుందని, కార్యదర్శి మద్దెల వెంకటేష్ తెలిపారు. ఇప్పటికైనా అధికారులు పంచాయతీ కార్యాలయానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

కారేపల్లి సీఐగా నునావత్ సాగర్

▸ తిరుపతిరెడ్డి నుంచి బాధ్యతల స్వీకరణ

కారేపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కారేపల్లి రూరల్ సీఐగా నునావత్ సాగర్ అదివారం బాధ్యతులు చేపట్టారు. ఇంతకాలంగా ఇక్కడపనిచేసి బదిలీపై వెళ్ళిన సీఐ బి.తిరుపతిరెడ్డినుంచి బాధ్యతులు స్వీకరించారు. సాగర్ వైరా నుంచి కారేపల్లి కి బదిలీపై వచ్చారు.

వైరా సీఐగా వెంకటప్రసాద్



వైరా, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వైరా సీఐగా ఆదివారం వై.వెంకటప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఇంతకాలంగా వైరా సీఐగా పనిచేసిన నునావత్ సాగర్ కారేపల్లి సీఐగా బదిలీపై వెళ్ళారు. వైరా స్టేషన్ బాధ్యతలు చేపట్టిన వెంకటప్రసాద్‌ను పలువురు సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణ కోసం తనవంతు కృషి చేస్తానన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

▸ బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కట్టా

వైరా, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని, గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు ముందుకురావాలని పార్టీ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీనికేతన పాఠశాలలో ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాక్రమానికి వైరా పట్టణ అధ్యక్షుడు మద్దెల రవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కృష్ణార్జునరావు మాట్లాడుతూ.. రాబోవు స్థానిక ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పార్టీ గేలుపే ధ్యేయంగా పనిచేయాలన్నారు. సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, జిల్లా వర్తక సంఘం అధ్యక్షులు వనమా విశ్వేశ్వరరావు, దారెల్లి పవిత్ర,కుమారి, మాదినేని దుర్గాప్రసాద్, దొంతేబోయిన వెంకటేశ్వర్లు, ఎదునూరి శ్రీను, నుకల వాసు, తన్నీరు నాగేశ్వరరావు, మోటపోతు సురేష్, అప్పం సురేష్, అదురి ప్రేమ్‌కుమార్,మిట్టపల్లి సత్యంబాబు, బత్తుల లింగారావు, కారుకొండ బోస్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణార్జునరావు

రాఘవాపురంలో ఎన్ఎస్ఎస్ శిబిరం

చింతకాని, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాఘవాపురం గ్రామంలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్ కార్యక్రమం ఆదివారం కొనసాగింది. వీధుల్లో, రోడ్ల వెంట ఉన్న చెత్తను తొలగించారు. వీధులను శుభ్రపరిచి చెత్తను డంపింగ్ యార్డుకు తరలించారు. అనంతరం గ్రామంలో నెలకొన్న సమస్యలపై సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండపర్తి గోవిందరావు, కళాశాల ప్రిన్సిపాల్ కుతుంబాక సునీల్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ జయప్రద, అధ్యాపకులు ఉమాశంకర్, ఉపేందర్, చంద్రశేఖర్, రాజేష్, రాంబాబు, నరసింహరావు, వాలంటీర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.


గ్రామ వీధుల్లో చెత్త తొలగిస్తున్న విద్యార్థులు

ఫటాఫట్

నేరాల అదుపునకు ప్రత్యేక చర్యలు

ఏన్కూరు ఎస్ఐ సంధ్య



ఏన్కూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నేరాల అదుపుకు ప్రత్యేక చరయలు చేపడుతున్నట్టు ఎస్ఐ నారబోయిన సంధ్య తెలిపారు. ఆదివారం ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు.

ఆంధ్రజ్యోతి: నేరాల అదుపుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఎస్ఐ: నేరాల అదుపుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం సీసీ కెమేరాలు ఏర్పాటుతో పాటు రాత్రిపూట గ్రామాల్లోపెట్రోలింగ్‌నిర్వహించడంజరుగుతుది

ఆంధ్రజ్యోతి: రోడ్డు ప్రమాదాల నివారణకు/ ఎలాంటి చర్యలు చేపడుతున్నారు

ఎస్ఐ: ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులునిర్వహించడంజరుగుతుంది. డ్రైవింగ్ లైసెన్సు, హెల్మట్, వాహనాలు నడిపే షైనర్లపై చాలాన విధించడం తోపాటు వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కలిగిస్తూ ప్రమాదాల నివారణక చర్యలు చేపడుతున్నాం

ఆంధ్రజ్యోతి: యువతసన్మార్గంలో నడవడానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఎస్ఐ: యువత సన్మార్గంలో నడవడానికిఅవగాహన సదస్సులను ఏర్పాటుచేస్తున్నాం. గుట్కా, గంజాయి, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచిస్తున్నాం.

కోటయ్య మృతికి టీడీపీ, కాంగ్రెస్ నాయకుల సంతాపం

బోనకల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆళ్లపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పారా కోటయ్య మృతికి ఆ పార్టీ పార్లమెంటరీ అధ్యక్షుడు వాసిరెడ్డి రామనాధం సంతాపం తెలిపారు. గ్రామంలో ఆదివారం నిర్వహించిన సంతాప సభలో పాల్గొని నివాళులర్పించారు. కోటయ్య పార్టీ పట్ల నిబద్దతతో పని చేసిన నాయకుడిగా ఆయన లేని లోటు తీరనిదిగా అభివర్ణించారు. అదేవిదంగా ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటీ రామకోటేశ్వరరావు, వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బుంగా రాములు, పారా వెంకటమోహన్‌రావు, తోటకూర వెంకటేశ్వరరావులు, టీడీపీ మండల అధ్యక్షుడు రావుట్ల సత్యనారాయణ, మరీదు బరకయ్య తదితరులు సంతాపం తెలిపారు.


కోటయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వాసిరెడ్డి రామనాధం, ఇతరులు

సామాజిక సేవలో.. 'తోపుడు బండి' సాదిక్ అలీ సేవలు మరవలేనివి

▸ సాదిక్‌అలీ సంస్మరణ సభలో పలువురు వక్తలు


సాదిక్ అలీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కవులు, ప్రముఖులు

కల్లూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సామాజికంగా తోపుడుబండి ఫౌండేషన్ అధినేత సాదిక్‌అలీ అందించిన సేవలు మరవలేనివని పలవురు ప్రముఖులు, కవులు, విద్యావేత్తలు అన్నారు. కల్లూరులో ఆదివారం స్థానిక కాళోజీనగర్‌లో తోపుడుబండి సాదిక్‌అలీ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు ప్రసంగిస్తూ సాదిక్ అలీ తోపుడుబండి ఫౌండేషన్‌ను స్థాపించి రాష్ట్రంలోని హైదరాబాద్, వరంగల్, ఖమ్మం తదితర జిల్లాలోని అనేక ప్రాంతాల్లో యాత్ర చేసి విజ్ఞాదాయకమైన పుస్తకాలు పంపిణీ చేసి ఎంతో మంది విద్యార్థులకు జ్ఞానోదయం కల్పించారన్నారు. ఇంకాను పేద విద్యార్థులకు విద్యారంగంలో రాణించేలా సెల్‌ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లు అందించారని, ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు దుస్తులు, నోట్‌బుక్స్, పెన్నులు, బ్యాగులుతో పాటుగా వారికి అవసరమైన ఆర్థిక సహకారం అందించారన్నారు. ఎంతో మంది నిరుపేదలకు అన్నదానం, ఆర్థిక సహకారం కూడా అందించారన్నారు. సాదిక్‌అలీ కుటుంబ పరంగా లాభపేక్షలేకుండా సామాజిక సేవకే తన జీవితం అంకితం చేశారన్నారు. తన సేవల ద్వారా పేదల హృదయాల్లో నిలిచిన ఆదర్శనీయుడుగా, కవిగా, జర్నలిస్టుగా కూడా సమాజానికి సేవలందించి రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు పొందిన వారిలో సాదిక్ అలీ ఒకరని చెప్పారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించేలా తోపుడుబండి సంస్థ తరుపున ఆర్థికంగా చేయూత అందించారని వక్తలు చెప్పారు. కరోనా సమయంలో పేదలకు అన్నదానం, వైద్య సహాయం కూడా అందించారని, గిరిజన ప్రాంతాల్లో పేదలకు తమ సేవలను విస్తరించారని అన్నారు. ఈ సందర్భంగా సాదిక్‌అలీ సేవలను, గుర్తిస్తూ ఆయనతో ఉన్న అనుబంధాన్ని నేమరువేసేందుకు ఖమ్మం జిల్లా కవి మిత్రులు తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో రూపొందించిన సంస్మరణ సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాదిక్‌అలీ చిత్రపటానికి పలువురు కవులు, విద్యా, సామాజిక వేతలు, ప్రముఖ రాజకీయ పార్టీల నాయకులు, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు అభిమానులు పూలమాల వేసి ఘనమైన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గురుకుల విద్యాలయ సంస్థ విశ్రాంత అధికారి ఎం.పుల్లయ్య, బంధుమిత్రులు ఫయాజ్‌అలీ, రియాజ్, ప్రముఖ కవి కపిల రాంకుమార్, కుటుంబ సభ్యులు ఉషా సాదిక్, హబీబున్నీసా, సలీం, డాక్టర్ ఆషా, సహనం, ఉమా, కిషోర్‌దత్ సుజాత, కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, తక్కెళ్లపాటి దుర్గాప్రసాద్, సిపిఐ మండల కార్యదర్శి దమాల దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సకాలంలో పరిహారం అందించాలి

▸ ఆందోళనకు సిద్ధం అవుతున్న నిర్వాసితులు

కారేపల్లి అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రైల్వే లైన్ డబ్లింగ్ పనుల కోసం భూములు, ఇండ్లు కోల్పోయిన నిర్వాసితులకు న్యాయపరంగా రావాలిసిన నష్టపరిహారాన్ని అందెలా చూడాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌కు విన్నపించారు. ఈ సందర్భంగా ఆయన ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకపోయి న్యాయం జరిగేల చూస్తానని హామీ ఇవ్వగా తమకు సరైన న్యాయం జరగకపోతే ఆందోళన చేస్తామని రైతులు అన్నారు. కారేపల్లి పంచాయతీ పరిధిలోని రైతులకు ఎకరాకు కేవలం రూ.7లక్షలు మాత్రమే పరిహారం ఇస్తామంటు ప్రకటిస్తున్నారని, మండల కేంద్రంలో భూములకు అధిక ధరలు పలుకుతున్నాయని, వాటికి అనుగుణంగా ఎకరాకు రూ.91లక్షలు చెల్లించాలని నిర్వాసితులు రెండు రోజల క్రితం మండల కేంద్రంలో జరిగిన గ్రామ సభలో స్పెషల్ డిప్యూటి కలెక్టర్ రాజేశ్వరికి వినతిపత్రరం అందచేశారు. న్యాయంగా అధికారులు పరిహారం అందించక పోతే ఆందోళనకు సిద్దం అవుతామని, ఆదివారం రైతులు తెలిపారు.

అధ్వానంగా ఆర్అండ్‌బి రహదారి

▸ ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

▸ పట్టించుకోని అధికారులు

వేంసూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భరణిపాడు-పర్వతాపురం గ్రామాల మధ్య ఆర్అండ్‌బీ రహదారి గోతులతో అధ్వానంగా తయారైంది. దీంతో వాహనదారులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం ఈ రహదారిలో భారీ వాహనాలు తిరుగుతుండడంతో మోకాలు లోతు గుంతలేర్పడ్డాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఈ రహదారికి మరమ్మతులు చేయించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసిన సమయంలో గోతుల్లో నీళ్లు చేరి దగ్గరకు వచ్చే కన్పించకపోవడంతో పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి ఈ రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు ముక్తకంఠంతో అధికారులును కోరుతున్నారు.


గోతులతో భరణిపాడు-పర్వతాపురం ఆర్అండ్‌బీ రోడ్డు

దెబ్బతిన్న పంటలకు పరిహారం చెల్లించాలి

▸ సీపీఎం రైతు బృందం

వైరా, క్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలతో దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొంతురాంబాబు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గన్నవరంలో అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటలను వైరా రూరల్ మండల పార్టీ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. అధిక వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్నాయన్నారు. దెబ్బతిన్న రైతల పంటలను ప్రభుత్వం సర్వే జరిపి ఎకరాకు రూ.30వేల రూపాయలు చెల్లించాలన్నారు. కౌలు రైతులకు 60వేలు చెల్లించాలన్నారు. వర్షాలకు ప్రధానంగా పత్తి, పెసర పంటలు చేతికి రాలేదన్నారు. ప్రభుత్వం సమగ్ర సర్వేచేసి రైతులను అదుకోవాలన్నారు. తోట నాగేశ్వరరావు, తూము సుధాకర్, జింకలగూడెం శాఖ కార్యదర్శి షేక్ ఖాసీం, కారుమంచి మల్లయ్య, దావీదు, యాకోబు పాల్గొన్నారు.


పంటలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

తొలగనున్న విద్యుత్ కష్టాలు

▸ నూతన సబ్‌స్టేషన్ల మంజూరుతోపాటు విద్యుత్ లైన్లు

▸ ఫలించిన డిప్యూటీ సీఎం భట్టి కృషి

బోనకల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కృషితో ఏళ్ల తరబడి ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ కష్టాలు క్రమేణా తొలిగిపోతున్నాయి. నాణ్యమైన విద్యుత్ సరఫరాతో ప్రజల చిరకాల వాంఛ నేరవేరుతుంది. ప్రధానంగా లో వోల్టేజీ, వదులుగా ఉన్న విద్యుత్ తీగలు, తరుచు ట్రిప్పు కావడం లాంటి సమస్యలతో ప్రజలు సతమతమయ్యేవారు. ఏళ్ల గడిచినా విద్యుత్ కష్టాలు తీరక పోవడం వారిని నిరాశ, నిస్పృహలకు గురి చేసింది. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రావడంతోపాటు భట్టి విద్యుత్‌శాఖ మంత్రిగా ఉండడం మధిర ప్రజలకు వరంగా మారింది. దీర్ఘకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలపై దృష్టి సారించి, నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ఆ శాఖలో తన మార్కును చూయించారు. దింతో మారుమూల పల్లెల్లో సైతం విద్యుత్ వెలుగులు విరజిమ్ముతున్నాయి.

నూతనంగా మూడు సబ్ స్టేషన్ల ఏర్పాటుకు శ్రీకారం

ప్రస్తుతం బోనకల్ మండలంలో జానకీపురం, మోటమర్రి, రావినూతల గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. వీటికి తోడు నూతనంగా చిరునోముల, లక్ష్మీపురం, బ్రాహ్మణపల్లి గ్రామాలకు మూడు సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయి. 5ఎంఏ సామర్థ్యం గల ఒక్కొక్క విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం కోసం దాదాపు రూ.2.50 కోట్ల నిధులను కూడా కేటాయించడంతో పనులను ప్రారంభించడం కోసం డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేయనున్నారు.


ఏర్పాటు చేసిన నూతనట్రాన్స్‌ఫార్మర్, పొలాల్లోతీగలు వేస్తున్న దృశ్యం

ఇందుకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుత్ తీగలు వదులుగా ఉండడంతో తరుచు ప్రమాదాలతో పాటు విద్యుత్ సమస్యలు ఉత్పన్నమయ్యేవి. పరిష్కారం కోసం 250 విద్యుత్ స్తంబాలు వేశారు. మరో 150 విద్యుత్ స్తంబాలు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపారు. పొలాల్లో వేలాడే సర్వీసు తీగల వల్ల ప్రమాదాలు పొంచి ఉండడంతో 130 మిడిల్ పోల్స్ వేశారు. మండలంలో మొత్తం 13వేల విద్యుత్ సర్వీసులు ఉండగా గృహజ్యోతి పథకం కింద 8500 సర్వీసులకు ఉచిత విద్యుత్ అందుతుంది. రైతుల పొలాల్లో 2800 విద్యుత్ మోటర్ కనెక్షన్లు ఉండగా వాటి విద్యుత్ సరఫరా కోసం 705 ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. విద్యుత్ సమస్యలను అదిగమించేందుకు పెద్దగోపతి నుంచి రావినూతల సబ్‌స్టేషన్ వరకు ఇంటర్ లింక్ విద్యుత్ లైన్ పనులను పూర్తి చేశారు. నాణ్యమైన విద్యుత్ సరఫరాను ప్రజలకు అందించేందుకు గానూ అన్ని రకాల పనులను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. తమకు విద్యుత్ కష్టాలు తీరుతున్నందుకు డిప్యూటీ సీఎం భట్టికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి ఆర్టీసీ డిపో పరిధిలో నెలకొన్న సమస్యలు, సలహాలు, సూచనల కోసం నేడు గంటపాటు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్న డిపో మేనేజర్ ఊటుకూరి సునీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈరోజు సాయంత్రం 4 గంటల నుంచి 5గంటల వరకు 9959225962కు తనతో మాట్లాడవచ్చునని పేర్కొన్నారు.

ఆకట్టుకునే పచ్చదనం

▸ ఇంటి ఆవరణలో ఆహ్లాదకర వాతావరణం

తల్లాడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): భూమికి పచ్చని రంగు వేసినట్టు పచ్చదనం. పండ్లు, పూలు, కూరగాయల మొక్కలతో ఇంటి ఆవరణలో అడుగు పెడితే ఆహ్లాదకర వాతావరణం స్వాగతం పలుకుతుంది. తల్లాడ మండలం నారాయణపురం గ్రామంలోని సొసైటీ చైర్మన్ రెడ్డెం వీరమోహన్‌రెడ్డి నూతనంగా నిర్మించిన ఇంటి ఆవరణ పచ్చదనంతో కళకళలాడుతుంది. వీరమోహన్‌రెడ్డి ఇంటి ఆవరణలోని 5కుంటల విస్తీర్ణంలో జామ, సపోటా, క్రోటన్-4 రకాలు, గులాబీ, కనకాంబరం, బంతి, పట్నం బంతి, గన్నేరు, వంగ, బెండ, కాకర, చిక్కుడు మొక్కలు, గ్రాస్ పెంచుతున్నారు. వీటిలో పండ్లు, పూలమొక్కలు, గ్రాస్‌ను కడియం నర్సరీ నుంచి తెచ్చి నాటారు. సేంద్రియ ఎరువులతో మొక్కలను పోషిస్తున్నారు. స్వచ్ఛమైన ప్రాణవాయువు, సహజ సిద్ధమైన పండ్లు, కూరగాయలు, పూజాలంకరణ పూల మొక్కలు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.


ఇంటి ఆవరణలో పెరుగుతున్న మొక్కలు

ఆహ్లాదం కోసం పెంచుతున్నాం

రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, ఇంటి యజమాని



ఇంటి ఆవరణలో ఆహ్లాదకరవాతావరణ కోసం పండ్లు, పూలు, కూరగాయలు, అలంకరణ మొక్కలు పెంచుతున్నాం. స్వచ్ఛమైన గాలి, సహజ సిద్ధమైన పండ్లు, కూరగాయలు పండించాలనే ఉద్దేశంతో వ్యయ, ప్రయాసలకోర్చి కడియం నర్సరీ నుంచి మొక్కలు తెచ్చి సెంద్రీయ ఎరువులతో పోషిస్తున్నాం. కోతుల నుంచి రక్షణ కోసం సోలార్ ఫెన్సింగ్ ను కూడా ఏర్పాటు చేశాం.